ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 35.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.23 (ఆది)
సహరి : 4.44 (సోమ)

ఇక ప్రతీనెలా జాబ్‌మేళా

- అర్హత ఉన్న యువతకు ఉద్యోగాలు
- వచ్చే మార్చిలోపు ఏడు వేల మందికి ఉద్యోగ అవకాశాల కల్పన
- పర్యాటక ప్రాంతాలుగా కొల్లేరు, పోలవరం
- తాగునీటి కొరత రానీయొద్దు
- కేంద్ర పథకాలు అందుతున్నాయో, లేదో చూడాల్సిందే..
- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశంలో ఎంపీ పుట్టా


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, చిత్రంలో ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్ కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : 'అర్హులైన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రతీనెలా జాబ్‌మేళా నిర్వహించాలి. జిల్లాను పారిశ్రామికంగా నిలదొక్కుకునేలా చేయాలి. ఆ మేరకు అందరం కష్టించి పనిచేయాలి' అని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. ఏలూరులోని గోదావరి సమావేశపు హాలులో శనివారం జరిగిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ సమావేశానికి ఎంపీ అధ్యక్షత వహించారు. వచ్చే మార్చిలోగా జిల్లాలో ఏడు వేల మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రతీనెలా జాబ్ మేళాలు నిర్వహించడం, సమాంతరంగా పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వివిధ అంశాలపై సమావేశంలో ఆయన చర్చిస్తూ జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి పథంలో నిలిపే బాధ్యతను అందరూ తీసుకోవాలన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన భూమికి అవసరమైన ల్యాండ్ బ్యాంక్ వివరాలను సేకరించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రతీ ఇంటి కి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు. రానున్న వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్త కుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2.58 లక్షల కుటుంబాలకు పని దినాలు కల్పించాలని, 40 శాతం మెటీరియల్ కాంపోనెంట్ కింద 206 కోట్ల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ వంటి పనులు చేపడుతున్నట్టు వెల్లడించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో తొమ్మిది వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగయ్యేలా చూడాలన్నారు. సుమారు రూ.109 కోట్లతో ప్రతిపాదించిన ఉంగుటూరు-కైకలూరు రోడ్డు నిర్మాణ పనులపై చర్యలు తీసుకోవాలని, టి.నర్సాపురం-చింతలపూడి, టి.నర్సాపురం- జంగారెడ్డిగూడెం రోడ్ల నిర్మాణ పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలన్నారు. దేశంలో 50 ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకుందని, వీటిలో మన జిల్లాలోని కొల్లేరు, పోలవరం ప్రాజెక్టు ప్రాంతాలను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రతిపాదనలను సమర్పించాలని ఎంపీ అధికారులను ఆదేశించారు.

భీమడోలు మండలం మల్లవరం, చెట్టున్నపాడుల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ కోరగా మంగళవారం నుంచే ఆగడాల లంక ఛానల్ నుంచి తాగునీటి అవసరాలకు నీటిని విడుదల చేస్తామని ఇరిగేషన్ ఎస్‌ఈ నాగార్జున చెప్పారు. జిల్లాలో పారిశ్రామిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే రూ.1,830 కోట్ల విలువైన 4,302 ఎకరాల ప్రభుత్వ భూమిని ల్యాండ్ బ్యాంక్ ద్వారా గుర్తించామని కలెక్టర్ వెట్రిసెల్వి సమావేశం దృష్టికి తెచ్చారు. జిల్లాలో ఏప్రిల్ 10న జాబ్‌మేళా నిర్వహించి వెయ్యి మందికి ఉపాధి కల్పించే దిశగా కార్యాచరణ సిద్ధం చేసినట్టు ప్రకటించారు. సమావేశంలో చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, జేసీ పి.ధాత్రిరెడ్డి, జడ్పీ సీఈవో భీమేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఇరిగేషన్ ఎస్‌ఈ నాగార్జున రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈ త్రినాథబాబు, వ్యవసాయాధికారి హబీబ్ పాషా, ఉద్యాన శాఖ డీడీ రామ్మోహన్, డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని, డీఈవో వెంకటలక్ష్మమ్మ, పౌర సరఫరాల మేనేజర్ శ్రీలక్ష్మి, నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ పాల్గొన్నారు.

- జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీలో పది మంది పేర్లను ఎంపీ ప్రతిపాదించారు. నత్తా దివ్యదీప్తి, చీకటి తవిత, అడపా నాగలక్ష్మి, మునునూరు లక్ష్మి, రందే లక్ష్మీసునీత, షేక్ కరీముల్లాషా కాదిరి, జంగం వెంకటేశ్వరరావు, మొడియం శింగరాజు, పిల్లరిశెట్టి సంధ్య, ఆలూరి రమేష్‌కుమార్‌లను నియమించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి ప్రతిపాదించారు.

ఎన్నిసార్లు చెప్పాలి సార్ : చింతమనేని

'పదేపదే సమస్యను చెప్పడానికి అధికారులను పిలుస్తున్నాను. కాని ఏ ఒక్కరూ రావడమేలేదు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ఎక్కడో ధవళేశ్వరం నుంచి 120 కిలోమీటర్ల మేర పైప్‌లైను వేసి గోదావరి జలాలు తెచ్చేదానికంటే ప్రత్యామ్నాయంను నేను చాలాసార్లు అధికారుల ముందుంచాను. నా నియోజకవర్గ పరిధిలోని జానంపేట వద్ద పోలవరం కుడి కాల్వ ద్వారా పైపులైను నిర్మిస్తే పది కిలోమీటర్ల దూరంలోనే అటు ఏలూరుకు, ఇటు దెందులూరు నియోజకవర్గానికి సులభంగా తాగునీరు అందించవచ్చు. ఈ విషయంలో సమగ్ర నివేదికలు సమర్పించారా, లేదా అని అడుగుతూనే ఉన్నా. ఇదిగో సబ్‌మిట్ చేశామని, పరిశీలిస్తున్నామని చెబుతున్నారు. 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రక్షిత తాగునీటి పథకాలకు ఫిల్టర్‌బెడ్స్ మార్పు చేయాల్సిందే. ఓవర్‌హెడ్ ట్యాంకులకు మరమ్మతులు చేపట్టాలి.

కొల్లేరు సమస్యకు త్వరలో పరిష్కారం

మానవత దృక్పథంతో కొల్లేరు సమస్య చిక్కుముడిని అందరి సమష్టి కృషితో పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ అన్నారు. సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. కొల్లేరుకు సంబంధించి స్థానికంగా చాలా ఇబ్బందులు ఉన్నాయని, వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. సుప్రీం ఆదేశాల మేరకు సమాచారాన్ని పూర్తిగా సమర్పించేందుకు కొంత సమయం పడుతుందన్నారు. ఈ సున్నితమైన సమస్య పరిష్కారానికి చాలా సమయం పట్టే కనపడుతున్నప్పటికీ వంద శాతం పరిష్కరిస్తామన్నారు.






రోదిస్తున్న తండ్రి, భార్య

చక్రవర్తీ.. వెళ్లిపోయావా..!

పేదింట పెద్ద విషాదం

- మినప కోత యంత్రం మీద పడి కూలీ మృతి
- ఎనిమిది మంది కుటుంబ సభ్యులకు ఇతనే ఆధారం
- పక్షవాతంతో తండ్రి.. దివ్యాంగులైన ఇద్దరు అక్కలు
- వృద్ధురాలైన తల్లి.. అనాథలైన భార్య, ఇద్దరు చిన్నారులు
- మాకు దిక్కెవరంటూ విలపిస్తున్న కుటుంబం

ముదినేపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి):ఓ వైపు పేదరికం. మరోవైపు పెద్ద కుటుంబం. ఇది చాలదన్నట్టు వృద్ధులైన తల్లిదండ్రులు. తండ్రికి పక్షవాతం. దివ్యాంగులైన ఇద్దరు అక్కలు. భార్య, మూడేళ్లలోపు ఇద్దరు పిల్లలు. తనతో కలిసి ఎనిమిది మంది కుటుంబం. అతను రోజు కూలికి వెళితేనే కుటుంబం గడు స్తుంది. అలాంటి ఆ పేదింట పెనువిషాదం చోటు చేసుకుంది. కుటుంబానికి ఆధారమైన అతను అకస్మాత్తుగా చనిపోతే.. వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారుతుంది. అలాంటి పరిస్థితే ముదినేపల్లి మండలం సంకర్షణపురంలోని ముత్యాల చక్రవర్తి(32) కుటుంబంలో చోటు చేసుకుంది. శుక్రవారం పెనుమల్లి వద్ద మినపకోత యంత్రం తనపై పడిపోవడంతో చక్రవర్తి దుర్మరణం పాలయ్యాడు. ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపగా, అతని కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. కూలి పనులు చేసుకునే చక్రవర్తి నాలుగేళ్ల క్రితం మౌనికతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. వీరితో పాటు పక్షవాతానికి గురై, మంచంపట్టిన తండ్రి కనకాంబరం, వృద్ధురాలైన తల్లి పుష్పరాణి బాగోగులు చూస్తున్నాడు. ముగ్గురు సోదరీమణులు. పెద్దామెకు పెళ్లి చేశాడు. ఆమె ఆలనా పాలనా ఇతనిదే. మిగిలిన ఇద్దరిలో ఒకరికి కళ్లు కనిపించవు, మరొకరు దివ్యాంగురాలు. వారి బాధ్యత చక్రవర్తిదే. ఈ పరిస్థితుల్లోనే చక్రవర్తిని మినప కోత మిషన్ రూపంలో మృత్యువు కబళించింది. కుటుంబం యావత్తు అనాథగా మారింది. ఎనిమిది మంది కుటుంబ సభ్యుల భారం ఎవరు మోస్తారన్నది ప్రశ్న. తండ్రిని పసితనంలోనే కోల్పోయిన ఇద్దరు పిల్లలను చూసిన వారికి హృదయం ద్రవించి, కళ్లల్లో నీళ్లు సుడులు తిరుగుతున్నాయి. శనివారం గ్రామంలో నిర్వహించిన చక్రవర్తి అంతిమయాత్రలో గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భవిష్యత్ అంధకారం..

'నా భర్త చక్రవర్తిని అకస్మాత్తుగా కోల్పోవడంతో కుటుంబ భవిష్యత్తు అంధకారంగా మారింది. ఇప్పుడు ఏం చేయాలో, పిల్లలను ఎలా ముందుకు తీసుకుని వెళ్లాలో అర్థం కావడం లేదు. నోట మాట రావడం లేదు' అంటూ భార్య మౌనిక కన్నీటి పర్యంతమైంది. 'నేను పక్షవాతానికి గురై మంచాన పడ్డాను. నాకు ఎంతో ప్రేమగా సపర్యలు చేసేవాడు. ఈ వయసులో మాకు కడుపుకోత మిగిల్చాడు. మా నుంచి దూరంగా వెళ్లిపోయావా చక్రవర్తీ..' అంటూ తండ్రి కనకాంబరం బోరున విలపించాడు. 'పేరుకు తమ్ముడే కాని తండ్రి కంటే ఎక్కువ. దివ్యాంగులమైన మమ్మల్ని చేయి పట్టుకుని నడిపించేవాడు. కంటికి రెప్పలా కాపాడేవాడు. తమ్ముడు లేడని తెలిసి ఏం చెప్పాలో.. అర్థం కావడం లేదంటూ అక్కలు చిన్నారి, ఏసమ్మ వెక్కివెక్కి ఏడ్చారు. ఈ కుటుంబ సభ్యులను ఓదార్చడం ఎవరితరం కావడం లేదు.


సమావేశంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్, ఏఎస్పీ సూర్యచంద్రరావు

గ్రామాల్లో శాంతి కమిటీల ఏర్పాటు : ఎస్పీ

ఏలూరు క్రైం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శాంతి కమిటీలు ఏర్పాటుచేసి వాటి ద్వారా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎస్పీ కేపీఎస్ కిశోర్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన జిల్లా నేరసమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'జిల్లాలో నమోదైన కేసులపై సమగ్ర విచారణ జరిపి కేసుల దర్యాప్తు, పురోగతిని వేగవంతం చేయాలి. ప్రతి సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్‌నకు వచ్చే ఫిర్యాదులను సత్వర పరిష్కరించాలి. పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యాపార సముదాయాలు, అపార్టుమెంట్లు తదితర ప్రదేశాల్లో సీసీ పర్యవేక్షణ కట్టుదిట్టం చేయాలి. పోలీసులు ప్రతి గ్రామాన్ని సందర్శించి చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలి. ప్రమాదాల నివారణ కోసం బ్లాక్ స్పాట్ల వద్ద తగిన రక్షణ తీసుకోవాలి. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి, అధికారులు ఎవరైనా అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటాం. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలి. (చికెన్ వ్యర్థాను రవాణా చేసే వాహనాలను సీజ్ చేసి యజమానులపై కేసులు నమోదు చేయాలి' అన్నారు. ఏఎస్పీ ఎన్. సూర్యచంద్రరావు, ఏఆర్ ఏఎస్పీ శేఖర్, ఏలూరు,పోలవరం, జంగారెడ్డిగూడెం డీఎస్పీలు శ్రావణకుమార్, ఎం.వెంకటేశ్వరరావు, రవిచంద్ర, డీటీసీ డీఎస్పీ ప్రసాదరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, జిల్లాలోని పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

కాగుపాడు పంచాయతీ సర్పంచ్‌కి షోకాజ్ నోటీస్

ఉంగుటూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కాగుపాడు పంచాయతీలో అవినీతి జరిగినట్టు నిర్ధారణ కావడంతో చెక్ పవర్ ఎందుకు రద్దు చేయకూడదంటూ సర్పంచ్ కడియాల సుదేష్ణకు డీపీవో అనురాధ షోకాజ్ నోటీస్ జారీచేశారు. పంచాయతీలో అవినీతి జరినట్టు వచ్చిన ఆరోపణలపై నూజివీడు డివిజినల్ పంచాయతీ అధికారిణి సుందరి ఇటీవల విచారణ జరిపారు. లోప భూయిష్టమైన పరిపాలన వల్ల, ఆర్థిక పరమైన లోపాల వల్ల మొత్తం రూ.15 లక్షల 54 వేల 244లు దుర్వినియోగం జరిగినట్టు నిర్ధారించారు. అప్పట్లో కార్యదర్శులుగా పని చేసిన గోడి బాలకృష్ణ హయాంలో రూ.1,42,014, వంగపండు శ్రీదేవి హయాంలో రూ.6,35,108, సర్పంచి కడియాల సుదేష్ణ రూ.7,77,122లు దుర్వినియోగం చేసినట్టు నిర్ధారించారు. ఈ ముగ్గురికి షోకాజ్ నోటీసుతోపాటు రికవరీకి నోటీసు ఇచ్చారు. సంజాయిషీ నోటీసుకు 15 రోజుల్లో సమాధానం తెలపకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆ నోటీసులో పేర్కొన్నట్టు ప్రస్తుత కార్యదర్శి దుర్గాధర్ వివరించారు.

తాబేళ్లు పరుగెడుతున్నాయ్

- కొల్లేరు కేంద్రంగా అక్రమ రవాణా
- చేపల వ్యానుల్లో సరిహద్దులు దాటేస్తున్నాయి
- ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ గిరాకీ
- జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- కొరవడిన అధికారుల నిఘా



పిల్ల రొయ్యిదే పెత్తనం

- నాణ్యమైన సీడ్‌తోనే మంచి దిగుబడులు
- దళారులను నమ్మి నష్టపోతున్న రైతులు
- జాగ్రత్తలు తీసుకుని కొనుగోలు చేయాలి

లోపలి పేజీల్లో..


మామిడి తోటలో పళ్లాలు (పంట కుంటలు) ఏర్పాటు చేస్తున్న కూలీలు

జలం..ఒడిసిపట్టు!

- ఉపాధి నిధులు రూ.60.36 కోట్లతో పండ్ల తోటల్లో పనులు
- సరిహద్దు కందకాలు పనులకు రూ.27.86 కోట్లు.. పంట కుంటలకు రూ. 32.50 కోట్లు
- భూగర్భ జలాల పెంపునకు దోహదం

ఏలూరు సిటీ, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : భూగర్భ జల సంపద పెంచడానికి ఉపాధి హామీ పథకంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ పథకానికి వ్యవసాయ రంగాన్ని అనుసంధానం చేయడంతో రైతులకు ప్రయోజనం చేకూర్చేలా పలు కార్యక్రమాలను డ్వామా నిర్వహిస్తోంది. జిల్లాలో పండ్లతోటల పెంపకం, పాడి పశువులు ఉన్న రైతులకు పశుగ్రాసం (గడ్డి) పెంపకం కార్యక్రమాలను రాబోయే జూన్ నుంచి అమలు చేయడానికి డ్వామా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెలలోనే ఈ పథకాలకు సంబంధించి రైతులను గుర్తిస్తారు. ప్రస్తుతం జిల్లాలో జల సంరక్షణలో భాగంగా మెట్ట గ్రామాల్లోని పండ్లతోటల్లో ప్రతి చెట్టు చుట్టూ పళ్లాలను (పంట కుంటలు) ఏర్పాటు చేస్తున్నారు. మెట్టలోని జంగారెడ్డిగూడెం, నూజివీడు, బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కొయ్యల గూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, ఆగిరిపల్లి, లింగపాలెం, చాట్రాయి, ముసునూరు, చింతలపూడి, కామవరపుకోట, టి.నరసాపురం, దెందులూరు, పెదవేగి, ద్వారకాతిరుమల మొత్తం 18 మండలాల్లో ఈ కార్యక్రమాన్ని రూ.32.50 కోట్లు ఉపాధి నిధులతో నిర్వహిస్తున్నారు. వీటితో పాటు భీమడోలు మండలంలోని రెండు పంచాయతీల్లో ఈ పనులు నిర్వహించాలని నిర్ణయించారు. ఎకరానికి సుమారు రూ.లక్ష ఖర్చు అవుతుంది. ఆ నిధులను ఉపాధి పథకంలో కేటాయిస్తున్నారు. జిల్లాలో పంట కుంటలను ఐదువేలు వరకు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే 2,374 పనులకు అనుమతులు ఇచ్చారు.

- పండ్ల తోటల్లో పంట పొలం చుట్టూ సరిహద్దు కందకాలు ఏర్పాటుకు రూ. 27.86 కోట్లు కేటాయించారు. ఎకరానికి రూ.90 వేలు ఉపాధి నిధులను కేటాయిస్తారు. పంటచేలల్లో పడిన వర్షపునీరు బయటకు పోకుండా ఆ పొలంలోనే ఇంకేలా ఈ సరిహద్దు కందకాలు దోహదపడతాయి. పంట కుంటల పథకానికి ఇప్పటికే జిల్లాలోని 2,786 ఎకరాలకు సంబంధించి రైతులు ముందుకొచ్చినట్టు అధికారులు చెబుతున్నారు.

పెరగనున్న భూగర్భ జలాలు

పండ్ల తోటలలో నిర్వహిస్తున్న జల సంరక్షణ కార్యక్రమాలతో జిల్లాలో భూగర్భ జల సంపద పెరగనుంది. వర్షపునీటిని సంరక్షించుకోవడానికి ఈ జల సంరక్షణ పనులు ఎంతగానో ఉపయోగపడతాయి. ఈ కార్యక్రమాలను జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించడానికి కార్యాచరణ రూపొందించాం. జిల్లాలో పంట కుంటలు, కందకాలు ఏర్పాటుకు రూ.60.36 కోట్లు కేటాయించారు. వర్షపునీటిని ఒడిసి పట్టటం వల్ల బోర్లలో నీటి నిల్వలు పెరుగుతాయి. పంట దిగుబడులు గణనీయంగా పెరిగే అవకాశాలున్నాయి. విద్యుత్ ఆదా అవుతుంది. రైతుల్లో అవగాహన పెరిగితే మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తాం.

- కె.వెంకట సుబ్బారావు, డ్వామా పీడీ

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌తో సమస్యలు పరిష్కారం



- చింతలపూడి-విజయవాడ బస్సు ప్రారంభం
- వినియోగంలోకి ఆకివీడు బస్టాండ్
- ఉంగుటూరు, తణుకు బైపాస్‌లో ఎక్స్‌ప్రెస్‌లు నిలుపుదల
- ఆర్టీసీ ఆర్ఎం వరప్రసాద్ వెల్లడి

భీమవరం టౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్‌లో ఈ నెల 12న ప్రయాణికులు లేవనెత్తిన పలు సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణాధికారి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆర్ఎం ఎన్‌వీఆర్ వరప్రసాద్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ 'చింతలపూడికి చెందిన తొర్లపాటి బాబురావు కోరిన విధంగా చింతలపూడి నుంచి విజయవాడకు ప్రత్యేక బస్సును శనివారం ప్రారంభించాం. ఉంగుటూరులో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు నిలుపుదల చేయాలని స్థానికుడు వంశీకృష్ణ అడిగిన విధంగా శనివారం నుంచి బస్సులు నిలుపుదల చేస్తున్నాం. ఏలూరు నుంచి మురళి, వెంకటేశ్వరరావు చేసిన ఫిర్యాదు మేరకు అధ్వానంగా వున్న ఏలూరు - విజయవాడ నాన్‌స్టాప్ బస్సులను మార్పు చేయించాం. జంగారెడ్డిగూడెంలో డ్రైవర్‌పై వచ్చిన ఫిర్యాదుపై సమస్యను పరిష్కరించాం. ఆకివీడు వైస్ చైర్మన్ పుప్పాల సత్యనారాయణ ఫిర్యాదు మేరకు స్థానిక బస్టాండ్ వినియోగానికి చర్యలు తీసుకునేలా భీమవరం అసిస్టెంట్ డిపో మేనేజర్ సురేష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పూర్తిస్థాయి వినియోగానికి చర్యలు తీసుకుని, బస్సులన్నీ అక్కడకు వచ్చేలా ఆదేశాలు జారీ చేశాం. తణుకు బైపాస్ రోడ్డులోని షర్మిష్ట రెస్టారెంట్ వద్ద బస్సులు ఆగేలా చర్యలు తీసుకున్నాం. తణుకు డిపోకు చెందిన హైదరాబాద్, తిరుపతి బస్సులు పట్టణంలోకి వెళ్లి బైపాస్ రోడ్డులోని షర్మిష్ట వద్ద ఆగేలా చర్యలు తీసుకున్నారు. ఇతర జిల్లాల బస్సులు ఆపేలా సంబంధిత జిల్లాల అధికారులకు సమాచారం ఇస్తాం' అని ఆర్ఎం వివరించారు.

నూతన బస్సు సర్వీసు ప్రారంభం

జంగారెడ్డిగూడెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం నుంచి చింతలపూడి, నూజివీడు మీదుగా విజయవాడ వెళ్లే సూపర్ డీలక్స్ బస్సును ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శనివారం ప్రారంభించారు. చింతలపూడి వరకు టీడీపీ నాయకులతో పాటు ఎమ్మెల్యే బస్ టిక్కెట్‌లు కొని ప్రయాణించారు. 'జంగారెడ్డిగూడెం నుంచి నూజివీడు, చింతలపూడి నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికులకు ఈ బస్సు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రతీ రోజు ఉదయం 5.30 గంటలకు జంగారెడ్డిగూడెం నుంచి బయలుదేరి పది గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి పది గంటలకు వస్తుందని డిపో మేనేజర్ గంగాధరరావు తెలిపారు. కూటమి నాయకులు రావూరి కృష్ణ, పరిమి సత్తిపండు, ఎన్.రామచంద్రరాజు, సీహెచ్. రామలింగేశ్వరరావు, ఎం.రామ్మోహనరావు, కె.శ్రీనివాసరావు, వలవల తాతాజీ తదితరులు పాల్గొన్నారు.


నూతన బస్సు సర్వీసును జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రోషన్‌కుమార్

కొరుకుడు పడని.. కంద!



- రైతు బజార్‌లో కిలో రూ.74.. బహిరంగ మార్కెట్‌లో రూ.100
- నిలకడగా టమాటా, బంగాళదుంప
- మార్కెట్‌ను ముంచెత్తుతున్న ములక్కాడ .. అందుబాటులో కూరగాయల ధరలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

దుంపల్లో రారాజుగా పిలిచే కంద ధర మార్కెట్‌ను హడలెత్తిస్తోంది. ఎప్పుడూ రూ.కిలో 50 లోపే ఉండ కంద ధర రైతు బజార్‌లోనే కిలో రూ.74 పలుకుతోంది. బహిరంగ మార్కెట్‌లో రూ.100కు పైగా అమ్మకాలు సాగిస్తున్నారు. ఇంకా కంద పంట రాకపోవడంతో డిమాండ్ ఎక్కువగా ఉంది. చేమ దుంపలు కిలో రూ.60పైనే పలుకుతోంది. ఈ పంట కూడా ఇంకా రైతుల చేతికి రాలేదు. శివరాత్రి నుంచి టమాటా ధర నిలకడగా ఉంది. రైతుబజార్‌లో కిలో రూ.16లకు లభిస్తుండగా, బహిరంగ మార్కెట్‌లో రూ.20 పైనే అమ్ముతున్నారు. వారం నుంచి ములక్కాడ మార్కెట్‌ను ముంచెత్తుతోంది. కాయ రూ.10 నుంచి 15 వరకు పలకగా, ఈ వారంలో రూ.పదికి మూడు కాయలు ఇస్తున్నారు. దేశవాళీతోపాటు హైబ్రిడ్ కాయలను హైవేల వద్ద, ఫుట్‌పాత్‌లపై విక్రయిస్తున్నారు. బీర, బెండ కిలో రూ.35 నుంచి రూ.40 అమ్మకాలు జరుగుతుండగా బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.50కి అమ్ముతున్నారు. వంగ రకాన్ని బట్టి రూ.30 నుంచి రూ.40 వరకు, గోరు చిక్కుడు రూ.36, కాకర రూ.34, దొండ రూ.34, బెండ రూ.32, క్యాబేజీ రూ.20 లోపే అమ్ముతున్నారు. పచ్చిమిర్చి రైతు బజార్‌లో కిలో రూ.16, బహిరంగ మార్కెట్‌లో రూ. 40 పలుకుతోంది. చిక్కుడు కాయల సీజన్ ముగుస్తుండ టంతో ధర భారీగానే ఉంది. కిలో రకం బట్టి రూ.76, రూ. 88, చిక్కుడు పాపి శ్ల రూ.56 కు అమ్ముతున్నారు. ఆకుకూరలు పదికి మూడు కట్టలు ఇస్తున్నారు. ఎండలు ముదిరితే వీటి ధరలు పెరుగుతాయి.

ఉల్లి.. వెల్లుల్లి.. అల్లం యథాతథం

సంక్రాంతి పండుగ నుంచి ఉల్లి కిలో రూ.30లకు అమ్ముతున్నారు. మహారాష్ట్రకు చెందిన గట్టిపాయ బహిరంగ మార్కెట్‌లో రూ.40కు అమ్ముడవుతోంది. చిన్న పాయలు రూ.120లకు 4 నుంచి 5 కిలోలు లభ్యమవుతున్నాయి. వెల్లుల్లి, అల్లం ఘాటు దాదాపుగా తగ్గినట్టే. వెల్లుల్లి కిలో రూ.80 నుంచి రూ.150 వరకు సన్నం, లావు రకాలు అమ్మకాలు జరుగుతున్నాయి. కిలో అల్లం రూ.60 నుంచి రూ.80 వరకు అమ్ముతున్నారు. సంక్రాంతి పండుగకు ముందు కిలో అల్లం రూ.250కు పైనే అమ్మకాలు చేశారు. పచ్చళ్ల సీజన్ శ్రీరామనవమి దాటాకే ఊపందుకునే అవకాశం ఉంది. దాంతో వెల్లుల్లి ధరకు రెక్కలొచ్చే అవకాశం ఉంది.



ఈ వీధి కుక్కలతో జాగ్రత్త..

శునకాలకు భయంకర చర్మవ్యాధి

ద్వారకాతిరుమలలో పెద్దసంఖ్యలో స్వైర విహారం



ద్వారకాతిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితంలో ఓ భాగమైన శునకాలు ఇప్పుడు ఆ మనిషి ఉనికికే ప్రమాదాన్ని తెచ్చి పెడుతున్నాయి. తీవ్రమైన చర్మ వ్యాధి బారిన పడిన ఈ వీధిశునకాలు హడలెత్తిస్తున్నాయి. డెర్మటైటిస్ అనే చర్మవ్యాధి సోకి చివరకు అవి మృత్యువాత పడుతున్నాయి. జుట్టు రాలి, ఒంటి నిండా పుండ్లు, వాటి నుంచి రక్తం కారుతూ అవి ఇప్పటికే వికృతంగా మారాయి. ఇవి దగ్గరకు వస్తున్నాయంటేనే జనాలు భయాందోళనలతో పరుగులు తీస్తున్నారు. ఇప్పటికే వీధికుక్కల ద్వారా ఈ స్కిన్ ఇన్ఫెక్షన్ కొన్ని పెంపుడు కుక్క లకు వాటినుంచి యజమానులకు కూడా ఈ వ్యాధి సోకిందని చెబుతున్నారు. దీంతో వారు చికిత్స పొంది, తమ పెంపుడు జంతువులను దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విడుస్తున్నట్లు తెలిసింది. ద్వారకాతిరుమల పరిధిలో వంద లాదిగా సంచరించే శునకాల్లో అధికశాతం కుక్కలకు ఈ చర్మవ్యాధి ఇప్పటికే సోకింది. నెలలుగా ఇవి వ్యాధి తీవ్రతతో బాధపడుతున్నా పంచాయితీ అధికారులు, పాలకులు పట్టించు కోవడం లేదు. వాటిని అటవీప్రాంతానికి తరలించి ఇతర ప్రాణులకు ఆ వ్యాధి సోక కుండా తీసుకోవాల్సిన చర్యలను వారు విస్మ రించారు. దీంతో పలుప్రాంతాల్లో ఇవి గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. ఇవి తిన్న ఆహారాన్ని తిన్న ఇతర శునకాలకూ ఈ ఇన్ఫెక్షన్ సోకుతోంది. పరిస్థితి ఇంత అధ్వాన్నంగా ఉన్నా అటు పశువైద్యాధికారులు, ఇటు పంచాయతీ, ప్రజాప్రతినిధులు ఎవరూ దృష్టి సారించక పోవడం ఆందోళనకరం. ద్వారకాతిరుమల ప్రాంతంలో దాదాపు 500 లకు పైగా ఉన్న వీధి కుక్కల్లో దాదాపు 90 శాతం శునకాలకు ఇప్పటికే ఈ ఇన్ఫెక్షన్ సోకింది. అవి గ్రామంలోను, శేషాచల కొండపైనా, ఆలయ పరిసరాల్లోను స్వైరవిహారం చేస్తున్నాయి.

ఇది ఒక అంటువ్యాధి



శునకాలకు వచ్చిన ఈ చర్మవ్యాధిని డెర్మ టైటిస్ అంటారు. శుభ్రత లేని కారణంగా మరిం తగా వాటికి బ్యాక్టీరియా సోకి చివరకు మృత్యు వాత పడుతున్నాయి. పెంపుడు కుక్కల యజమానులు జాగ్రత్తలు పాటించాలి. ద్వారకా తిరుమలలో అధికశాతం కుక్కలకు ఈ వ్యాధి సోకింది. వేరే కుక్కలతో ఇవి తిరగడం వల్ల ఆవ్యాధి వీటికీ అంటుతోంది.

- డాక్టర్ అంగర సురేష్,పశువైద్యాధికారి

అంతుచిక్కని వ్యాధితో గేదె దూడలు మృతి

చాట్రాయి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి మండలంలోని జనార్దనవరంలో అంతుచిక్కని వ్యాధితో గత 10 రోజుల నుంచి 10 గేదె దూడలు మృతి చెందాయి. పశుపోష కులు గూంట్రు నాగేశ్వరరావు, కాళంగి ఏడు కొండలు, కాళంగి గోపాలరావు తదితరులకు చెందిన 10 గేదె దూడలు మృత్యువాత పడ టంతో ఆవేదన చెందుతున్నారు. దూడలు ముందు రోజు పాలు తాగటం మానివేస్తున్నా యని, తరువాత రోజు జ్వరం వచ్చి మూడో రోజు చనిపోతున్నాయని బాధితులు అంటు న్నారు. పశువైద్యులు ఈ వ్యాధిని కనుగొని తగిన చికిత్స అందించాలని కోరుతున్నారు.



జనార్దవరంలో మృతి చెందిన దూడ

వ్యాక్సినేషన్ చేస్తాం

అస్వస్థతకు గురైన గేదె దూడలకు పశు వైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. దూడల మృతికి కారణాలు తెలుసుకొని మెరుగైన చికిత్స అందిస్తాం. గ్రామంలోని దూడలన్నిటికి ఆదివారం వ్యాక్సినేషన్ చేస్తాం. పశు పోష కులు ఆందోళన చెందవద్దు.

- డాక్టర్ శివ నాగేంద్రరావు, ఇన్‌చార్జి మండల పశు వైద్యాధికారి

పులిబొమ్మతో కోతుల బెడదకు చెక్

బూరుగుగూడెంలో ఓ రైతు ఐడియా



చాట్రాయి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పులిబొమ్మతో కోతుల బెడదకు రైతులు చెక్ పెడుతున్నారు. పంటలను కోతుల నుంచి కాపాడుకునేందుకు రైతులు పులిబొమ్మ, చింపాంజీ వేషాలు వేయడం వంటివి చేస్తున్నారు. చాట్రాయి మండలంలో అన్ని గ్రామాల్లో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగి పోయింది. కోతుల మందలు మొక్కజొన్న చేలపై పడి ధ్వంసం చేస్తుండటంతో రైతులు పంటను కాపాడుకోటానికి అవస్థలు పడుతు న్నారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు మొత్తం చేనుకు నాలుగు వైపులా కాపలా ఉన్నా కోతులను అడ్డుకోలేకపోతున్నారు. పులి బొమ్మను రైతు భుజాలపై పెట్టుకొని మొక్క జొన్న చేలో తిరుగుతుంటే దాన్ని చూసి కోతులు ఆ ప్రాంతం నుంచి కుయ్యో మొర్రో అంటూ పారిపోతున్నాయి. తమ ఐడియా పని చేసి కోతుల బెడద తగ్గడంతో రైతులు సంతోషపడుతున్నారు.



అనివేటి మండపం గుండా రాకపోకలు సాగిస్తున్న భక్తులు

భక్తులతో కళకళలాడిన శ్రీవారి ఆలయం

ద్వారకాతిరుమల, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయాన్ని శనివారం వేలాదిగా భక్తులు సందర్శించారు. శ్రీవారికి ప్రీతికరమైన రోజు కావడంతో దాదాపు పదివేల మందిపైబడి యాత్రికులు ఆలయానికి తరలివచ్చారు. పదో తరగతి పరీక్షలు జరుగుతుండటంతో భక్తుల రద్దీ కాస్త తగ్గినా ఆలయంలోని అన్ని విభా గాలు సందడిగా మారాయి. తమ మొక్కు బడు లను తీర్చుకున్న అనంతరం భక్తజనులు స్వామి, అమ్మవార్లను క్యూలైన్లలో వెళ్లి దర్శిం చుకు న్నారు. సాధారణ దర్శనానికి దాదాపు గంట పైబడి సమయం పట్టింది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం వారంతా ఉచిత అన్న ప్రసాదం స్వీకరించారు.

30న ఉగాది ఉత్సవం

క్షేత్రంలో ఈనెల 30న శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈవో సత్యన్నారాయణమూర్తి తెలిపారు. సాయంత్రం 6 గంటలకు శ్రీవారు ఉభయ దేవేరులతో శేషవాహనంపై కొలువై ఉగాది మండపం వద్దకు వస్తారని తెలిపారు. విశే షంగా అలంకరించిన ఉగాది మండపంలో స్వామి, అమ్మవార్లను ఉంచి విశేష పూజలు జరిపి అనంతరం పంచాంగ శ్రవణం జరుపు తామన్నారు. అనంతరం ఆలయానికి భూరి విరాళాలిచ్చిన దాతలకు, పండితులకు సత్కారం జరుగుతుందని వివరించారు.

బాలికలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి

ఏలూరు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో బాలికలపై అనేక దాడులు జరుగు తున్నాయని అత్యంత జాగ్రత్తగా ఉండాలని అదనపు జూనియర్ సివిల్ జడ్జిలు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు చొదిమెళ్ళలో ఉన్న అప్పర్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు బాలబాలికల వేధింపుల నిరోధక చట్టంపై ఏలూరు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రచన, జంగారెడ్డిగూడెం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రాజ రాజేశ్వరి తేజస్వి, పాలకొల్లు రెండో అదనపు జూనియర్ జడ్జి లావణ్య, తణుకు మొదటి అద నపు జూనియర్ సివిల్ జడ్జి రంజిత్ కుమార్‌లు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ బాలబాలికల రక్షణ కోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని వాటిపై అవ గాహన పెంచుకోవాలన్నారు. ఎవరైనా వేధిం పులకు పాల్పడితే అధైర్య పడకుండా తల్లి దండ్రులకు కాని ఉపాధ్యాయులకు కాని తెలి యజేయాలని సూచించారు. సమాజంలో బాలి కలపై అనేక ఘోరాలు పెరిగిపోయాయని జాగ్ర త్తగా నడుచుకోవాలని సూచించారు. బాలలు చిన్ననాటి నుంచే పర్యా వరణ రక్షణ మీద దృష్టి సారించాలన్నారు. మొక్కలు నాటడం వల్ల మంచి భవిష్యత్తులో జీవించవచ్చునన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జంగారెడ్డిగూడెం రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి తేజస్వి

పిల్ల రొయ్యదే పెత్తనం

విత్తు మంచిదైతే చెట్టు మంచిదవుతుందని నానుడి.. ఆక్వా సాగులో కూడా ఇదే మాట అక్షర సత్యంగా నిలుస్తుంది. రొయ్య చెరువుల విషయంలో మంచి రొయ్య సీడ్ ఎంపిక కీలకంగా నిలుస్తుంది. మంచి విత్తనం దొరికితే పంట పండినట్టే.. దళారుల మాట నమ్మి నాణ్యత లేని సీడ్ కొని చాలామంది రైతులు లక్షల్లో నష్టపోతు న్నారు.. ఉమ్మడి పశ్చిమ గోదావరిలో ఈ జనవరిలో 1.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేశారు. లక్షా 50 వేల టన్నులు దిగుబడి వస్తుందని అంచనా..



నాణ్యమైన సీడ్‌తోనే మంచి దిగుబడులు

దళారులను నమ్మి నష్టపోతున్న రైతులు

తగిన జాగ్రత్తలు తీసుకుని కొనుగోలు చేయాలి

నిడమర్రు మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : డాలర్ పంటగా పేరుగాంచిన రొయ్యలసాగులో సీడ్‌దే ప్రధాన భూమిక. పిల్ల బాగుంటే పంట బాగుంటుంది. నాణ్యమైన రొయ్య పిల్లల కోసం రైతులు ఎన్నో ప్రయత్నాలు చేస్తూంటారు. తోటి రైతులను ఆశ్రయించడమో, దళారుల మాయమాటలు నమ్మో సీడ్ కొనుగోలు చేస్తుంటారు. కొంతమంది రైతులు ఆయా హేచరీలలో టెక్నీషియన్ల ద్వారా నాణ్యమైన బ్యాచ్ వచ్చినప్పుడు ముందుగా అడ్వాన్సు బుకింగ్ చేసుకొని రొయ్య పిల్లను కొనుగోలు చేస్తుంటారు. చాలా సందర్భాల్లో నాణ్యత తక్కువగా గల సీడ్ కొనుగోలు చేసి లక్షల్లో నష్టపోతున్నారు. ఆరుగాలం ఇల్లూ వాకిలి వదిలి చెరువులు చుట్టూ తిరిగి పంట పండించిన రైతుకు నష్టమే మిగులుతోంది .తమకు పెట్టుబడి ఖర్చులు కూడా రాకుండా పోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

దళారులదే రాజ్యం

సంప్రదాయ రొయ్యసాగుకు అలవాటుపడ్డ మన రైతాంగం పక్కచెరువు రైతులు ఏ సీడ్ బుక్ చేస్తే అదే బుక్ చేయమని చెబుతుంటారు. ఇటీవల రొయ్య సీడ్ కంపెనీలు ఏజెంట్లును నియమించుకుని లక్ష సీడ్ అమ్మితే 3 వేల నుంచి 5 వేల వరకు కమీషన్ ఇస్తామని చెప్పడంతో వారు రైతులను మభ్యపెట్టి సీడ్ అమ్ముతున్నారు. నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా సీడ్‌ను తయారుచేసి రైతులకు అంటగడుతున్నారు. ఈ విషయంలో ఆక్వా అథారిటీ సరైన చర్యలు తీసుకోవడం లేదు. హేచరీ కంపెనీ వారు రొయ్య నాణ్యతను తెలియజేస్తూ ఇవ్వాల్సిన పరీక్షల రిపోర్టు కాపీలను రైతులకు ఇవ్వడం లేదు. రైతులు తమ చెరువులో సీడ్ వదిలిన 20 రోజుల తర్వాత ఆఫా, చెక్‌నెట్‌ల ద్వారా రొయ్య సీడ్ చెక్ చేసుకొంటే సీడ్ నిలబడకపోతే ఆ కంపెనీలు సమాధానం కూడా చెప్పడం లేదు. ఆ 20 రోజులకు రైతులు ఫీడ్ ఖర్చుల కింద లక్షల్లో నష్టపోతున్నారు.



రొయ్యల చెరువులో వేయడానికి తీసుకువెళుతున్న సీడ్

రొయ్య సీడ్ హేచరీలు

గతంలో పశ్చిమ తీరం నుంచి అనగా పాండిచ్చేరి నుంచి ఎక్కువగా రొయ్య సీడ్‌ను రైతులు తెప్పించుకొని సాగు చేసేవారు. కానీ ఇటీవల నెల్లూరు, కాకినాడ, ఒంగోలు, భోగాపురం ప్రాంతాలలో బ్రూడర్‌ను తెచ్చుకొని నాణ్యతా ప్రమాణాలతో సీడ్ ఉత్పత్తి చేస్తున్నారు. కొన్ని హేచరీలు నేప్లీ (అతి చిన్న రొయ్య సీడ్)లను దిగుమతి చేసుకొని నాణ్యతలేని మేతను వేస్తూ రోగ నిరోధకశక్తి పెంచే ఔషధాలు వాడకుండా సీడ్‌ను అమ్ముతున్నారు. దీని వల్ల రైతులు లక్షల్లో నష్టపోతున్నారు.

• నాణ్యమైన సీడ్‌తోనే మంచి దిగుబడి



సుమారు 10 ఎకరాల వరకు రొయ్యల చెరువులను సాగుచేస్తున్నాను.నాణ్యమైన సీడ్ వేయక పోవడం వల్ల రొయ్యలకు వైట్‌కట్, విబ్రియో, ఈహెచ్‌పీ వంటి రోగాలు వచ్చే అవకాశం ఉంది. లక్షల్లో పెట్టుబడి పెట్టి చేసే ఈ సాగులో నాణ్యమైన సీడ్ ద్వారా మంచి దిగుబడి సాధించగలం. హేచరీలు నాణ్యమైన సీడ్ అందించేలా ఎంపెడా తగిన చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వాలు కఠినమైన నిబంధనలు అమలు చేసి కల్తీలేని, నాణ్యమైన రొయ్య సీడ్‌ను రైతులకు అందించాలి.

-కొత్యాల కార్తీక్, రొయ్య రైతు, భువ్వనపల్లి

• అన్ని టెస్టులు చేసిన తర్వాతే కొనాలి



రొయ్య సాగులో సీడ్‌దే ప్రధాన పాత్ర. మంచి సీడ్ ఎంపిక చేసుకొంటే సగం క్రాప్ తీసినట్టే. సీడ్ ఎంపికలో రైతులు దళారులు మాటవిని నాణ్యత లేని నేప్లీలను వేసుకొని మోసపోవద్దు. సొంత బ్రూడర్ కలిగిన హేచరీలను మాత్రమే ఎంపిక చేసుకోవాలి. టెస్టులు చేసిన రొయ్యసీడ్‌ను మాత్రమే కొనుగోలు చేసుకొవాలి. వేసవిలో వైట్ కట్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నందున నాణ్యతగల సీడ్ వేయాలి. చెరువు నీటికి రెండు గంటల పాటు సీడ్‌ను అలవాటు చేశాకే వదలాలి.

- జువ్వలపల్లి రవీంద్ర, ఆక్వా ఫీడ్ టెక్నీషియన్, నిడమర్రు

నాణ్యమైన రొయ్య పిల్ల ఎంపిక ఇలా ..

- ప్రభుత్వ గుర్తింపు పొందిన హేచరీని ఎంపిక చేసుకోవాలి. హేచరీ ఎంపికతో పాటు బ్రూడర్ స్టాక్ కూడా అప్రూవ్ కల్గి ఉండాలి. బయోసెక్యూర్డ్ ఉన్న హేచరీ నుంచి తీసుకోవాలి.
- ఆర్‌టీ పీసీఆర్ టెస్ట్ సొంతంగా చేయించుకొని మంచి సీడ్ అని నిర్ధారణ అయ్యాకే సీడ్ కొనుగోలు చేసుకోవాలి. దీనిలో ఈహెచ్‌పీ టెస్ట్, విబ్రియో టెస్ట్, వైట్ స్పాట్ టెస్ట్‌లలో నెగెటివ్ రావాలి. సొంత బ్రూడర్ రొయ్య కల్గిన హేచరీ నుంచి కొనుగోలు చేయాలి.
- సీడ్ ఈఎల్ వయసు 12 రోజులు ఉండడం చాలా ఉత్తమం. అదీకాకపోతే పది రోజులు ఉన్నవైనా ఎంచుకోవాలి. ఓజోన్ సెక్యూరిటీ సిస్టమ్ ద్వారా వాటర్‌ను వాడే రొయ్య పిల్ల హేచరీల నుంచే కొనుగోలు చేసుకోవాలి.
- గతంలో కోనాబే రకం ఎక్కువగా సాగు అయ్యేది. తర్వాత హార్డీలైన్ రకం నడిచేది. ప్రస్తుతం నూతనంగా విడుదలైన వైట్‌కట్ తట్టుకొనే సై ఆక్వా రకం సీడ్ ఎంపిక చేసుకోవడం ద్వారా నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.
- మైక్రోస్కోపిక్ పరీక్ష, గ్రాస్ ఎగ్జామినేషన్ పరీక్ష, విబ్రియో పరీక్ష, పాలీమరైజ్ చైన్ రియాక్షన్ -పీసీఆర్ పరీక్ష , స్ట్రెస్ టెస్ట్‌లను స్వయంగా చేయించుకొని కొనుగోలు చేయాలి.ప్యాకింగ్ చేసే సమయం రాత్రి 8 గంటల తర్వాతే జరిగేలా చూసుకోవాలి.
- రొయ్య పిల్ల చెరువులో వదిలే సమయంలో ఓ డ్రమ్‌లో వేసి ఆక్సిజన్ పెట్టి రెండు గంటలపాటు ఉంచి తర్వాత మన చెరువు నీటికి అలవాటు చేస్తూ సీడ్ వదలాలి.
- రొయ్యపిల్ల ప్యాకెట్లు చెరువునీటి మీద సుమారు 2 గంటలపాటు తేలియాడే విధంగా ఉంచితే చెరువులో పీహెచ్ రొయ్య సీడ్ ప్యాకెట్‌లో పీహెచ్ సమానమవ్వడం ద్వారా 100 శాతం మనగిలిగేందుకు అవకాశం ఉంటుంది.

తాబేళ్లు పరుగెడుతున్నాయ్



కొల్లేరు కేంద్రంగా అక్రమ రవాణా

చేపల వ్యానుల్లో సరిహద్దులు దాటేస్తున్నాయి

ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ గిరాకీ

జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు

కొరవడిన అధికారుల నిఘా

కైకలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సు వివిధ రకాల మత్స్యసంపదకు పేరు. విదేశీ పక్షులకు ఆలవాలం. ఇలాంటి కొల్లేరు కేంద్రంగా అక్రమ తాబేళ్ల రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్కడకక్కడా దొరికిన తాబేళ్ళను గోనెసంచుల్లో మూటకట్టి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కైకలూరు నుంచి చేపల ఎగుమతి ముసుగులో ఈ తాబేళ్ల రవాణా జరుగుతోంది. అంతరించిపోతున్న తాబేళ్ల జాతిని పరిరక్షించాల్సిన అటవీశాఖ అధికారులు పట్టించు కోకపోవడంతో జిల్లాలు, రాష్ట్రాలు సరిహద్దులు దాటి తరలిపోతు న్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 356 రకాల తాబేళ్ల జాతులున్నట్లుగా పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. కొల్లేరు మంచినీటి సరస్సు పరివాహక ప్రాంతంలో ఉండే ఈ తాబేళ్లకు ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. వీటిని పట్టి రవాణా చూస్తూ రూ.లక్షల్లో జేబులు నింపుకుంటు న్నారు. కలిదిండి మండలం మద్దవానిగూడెం వద్ద, కైకలూరు మండలం ఉప్పుటేరు వద్ద ఉన్న చెక్ పోస్టులను అక్రమార్కులు మేనేజ్ చేయడంతో సరిహద్దులు దాటేస్తున్నాయి.



గతంలో స్వాధీనం చేసుకున్న తాబేళ్లను కొల్లేరులో వదిలి వేస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్ ఫొటో)

వివిధ ప్రాంతాల నుంచి సేకరణ

కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల నుంచి కొల్లేరు ఇతర ప్రాంతాల్లో చేపల పట్టుబడుల సమయాల్లో వలలకు చిక్కిన తాబేళ్ళను మత్స్యకారులు, యానా దుల నుంచి వారి వలలకు చిక్కిన తాబేళ్ళను సేకరించి ఒక్కొక్కటి రూ.5 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేస్తున్నారు. చెరువులు, కాలువల నుంచి సేకరించిన తాబేళ్లను జనసంచారం లేని బహిరంగ ప్రదేశాల్లో నిల్వచేస్తున్నట్లు సమాచారం. ఎగుమతులకు సరిపడా సేకరించిన తరువాత వాటిని చేపల వ్యానుల్లో ట్రేల చాటున గోనెసంచుల్లో ఉంచి రాత్రివేళల్లో సరిహద్దులు దాటిస్తు న్నారు. వారానికి రెండు నుంచి మూడు రోజులు వేల టన్నుల్లో అక్రమ రవాణా జరుగుతున్నా అధికారుల కంట పడడం లేదు.

ఇతర రాష్ట్రాల్లో వీటి మాంసానికి గిరాకీ

ఈ తాబేళ్లకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉండడంతో ఒడిశా, అస్సోం, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ మాంసానికి గిరాకీ ఎక్కువగా ఉంటుంది. సుమారుగా కేజీ రూ.300 నుంచి రూ.400కు అమ్మకాలు జరుగుతున్నాయి. వీటిని స్థానికంగా రూ.10 నుంచి రూ.15కు కొనుగోలు చేసి రూ.100 నుంచి రూ.150కు విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వన్య ప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా రవాణా చేస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. వన్యప్రాణుల చట్టం 1972 ప్రకారం తాబేళ్లను వేటాడినా, రవాణా చేసినా ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 వేలు వరకు జరిమానా విధిస్తారు. అయితే వీటిపై నిఘా లేకపోవడంతో వారి రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఆయా రాష్ట్రాల్లో ఆయుర్వేద ఔషధాల్లో వీటి మాంసాన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు తాబేళ్ల అక్రమ రవాణాను అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

• అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

తాబేళ్ల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. 45 రోజుల క్రితం కలిదిండి ప్రాంతంలో నూజివీడు టెరిటోరియల్ అటవీ శాఖ అధికారులు ఒక ఆటోను అదుపు లోకి తీసుకుని పది ట్రేలలో ఉన్న తాబేళ్లను స్వాధీనం చేసుకోవడమే గాక ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కొల్లేరు ప్రాంతంలోనూ ఇతర సరిహద్దుల్లోనూ అటవీశాఖ అధికారులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా రవాణా జరుగు తున్నట్లు తెలిస్తే సమాచారం అందిచాలి.

- రామలింగాచార్యులు, రేంజర్ , కైకలూరు

కొల్లేరు పంటకోడు ఆక్రమణపై ఫారెస్టు అధికారుల విచారణ

నిడమర్రు మార్చి 22 (ఆంధ్రజ్యోతి) నిడమర్రు మండలం దేవర గోపవరం గ్రామ శివారు కొల్లేరు సరస్సు 5వ కాంటూరు పరి ధిలో ఖండ్రిక పంట కాలువ ఆక్ర మించు కోవడంపై స్థానికుడు తుమ్మూరి శ్రీను రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో శనివారం జిల్లా ఫారెస్టు అధికారులు చెరువులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మోహినీ విజ యలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన విచారణలో ఆక్రమ ణలకు గురైన ఖండ్రిక పంటకాలువ సుమారు 9 ఆక్వా చెరువలులో ఉందని సుమారు 1.5 కి.మీ విస్తీర్ణం ఆక్రమణలకు గురైందని నిర్ధారిం చారు. 9 ఆక్వా చెరువుల రైతులకు సంబంధి ంచి 100 ఎకరాల విస్తీర్ణంలో గల ఆక్వా చెరు వుల రైతులకు చెరువులు ఖాళీ చేయవల సినదిగా నోటీసులు అందించారు. నోటిసులు అందుకొన్న రైతులు తమకు కొంతసమయం కావాలని కోరడంతో చట్టప్రకారం నడుచు కోవాలని సూచించారు. డీఎఫ్‌వో విజయ, సెక్షన్ ఆఫీసర్ గంగారత్నం. నిడమర్రు తహసీల్దార్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ బి.మోహినీ విజయలక్ష్మి, సిబ్బంది

వేగంగా పాలకొల్లు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు

పాలకొల్లు అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పాలకొల్లు రైల్వేస్టేషన్‌కు సంబంధించి వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతు న్నాయని డీఆర్‌యూసీ సభ్యుడు జక్కంపూడి కుమార్ తెలిపారు. స్టేషన్‌లో జరుగుతున్న పనులను, ఇన్‌చార్జి స్టేషన్ మాస్టర్ స్నేహతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ పాలకొల్లు, తణుకు, ఆకివీడు స్టేషన్లలో సుమారు రూ.20 కోట్లతో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, పాలకొల్లులో డ్రైయినేజీ నిర్మాణాలు, గూడ్స్ షెడ్లు, హమాలీల రెస్ట్ రూంలు, సైకిల్ స్టాండ్, ప్రహరీగోడ, వాటర్ పైపులైను పనులు జరుగుతున్నాయని తెలిపారు. కొల్లి కొండ ప్రసాద్, బోడ సత్య కనకరాజు (సతీష్), చెరు కూరి శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది ఉన్నారు.



రైల్వేస్టేషన్‌లో పరిశీలిస్తున్న డీఆర్‌యూసీ సభ్యుడు కుమార్, స్టేషన్ మాస్టర్ స్నేహ



ఉద్యాన పంటల ప్రదర్శన పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు : ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు ఉద్యాన పరిశోధన కేంద్రంలో కిసాన్ మేళా

కొవ్వూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతిక సహకారాన్ని అందిస్తూ, రైతుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునిస్తున్నట్లు కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు డాక్టర్ వైఎస్ఆర్ హెచ్‌యూ ఉద్యాన పరిశోధన కేంద్రంలో శనివారం కిసాన్‌మేళా-2025 నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే ముప్పిడి, డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చ రల్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె. గోపాల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతుల సంక్షేమంతో పాటు ప్రజల ఆరోగ్యాన్ని కాపా డడం కోసం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్స హిస్తోందన్నారు. వైస్ చాన్సలర్ డాక్టర్ గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యాన పంటల ఉత్పత్తి ఎక్కువగా ఉందన్నారు.విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టర్ బి. గోవిందరా జులు మాట్లాడుతూ ఆరు దశాబ్దాలుగా పరిశో ధనా స్థానంలో అభివృద్ధి చేసిన యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ పద్ధ తులపై శిక్షణ నిర్వ హిసున్నామన్నారు. కొవ్వూరు ఉద్యానవన పరిశో ధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త లలితాకామేశ్వరి మాట్లాడుతూ గత పదేళ్లలో 13 లక్షల టిష్యూ క ల్చర్ మొక్కలను అందజేశామన్నారు. ఈ మేళా 25లో ఉద్యాన విశ్వ విద్యాలయం పరిధిలోని పరిశోధనా కేంద్రాలు అంబాజీపేట, పందిరిమా మిడి, పెద్దాపురం, వెంకట్రామన్నగూడెం శాస్త్రవే త్తల ఆధ్వర్యంలో వివిధ ప్రదర్శనలను ఏర్పాటు చేశారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, ఎంపీపీ కాకర్ల నారాయుడు, మద్దిపట్ల శివరామ కృష్ణ, దాయన రామకృష్ణ, సూరవనేని చిన్ని, సూర్యదేవర రంజిత్ పాల్గొన్నారు.



మేరీమాత మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న పీఠాధిపతి జయరావు, తదితరులు

నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు ప్రారంభం

దేవరపల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): యావత్ ప్రపంచం సుఖశాంతులతో ఉండాలనేదే మేరీ మాత తల్లి ఆకాంక్షని ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పేర్కొన్నారు. నిర్మలగిరిలో మేరీమాత మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు పుణ్యక్షేత్రం అఖండ దేవాలయంలో ఏర్పాటు చేసిన బైబిల్ ప్రదర్శనను తిలకించారు. నూతనంగా భక్తుల సౌకర్యార్థం నిర్మించిన మరుగుదొడ్లను ఆయన ప్రారంభించారు. నిర్మలగిరి మేరీమాత మందిరం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్, పాదర్లు బాల, ప్రసాద్, నిర్మలగిరి పుణ్యక్షేత్ర అన్నదాన కాంట్రాక్టర్ కళ్ళే నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ ఆలయానికి రూ.1,51,116 విరాళం



గోపురం బంగారుతాపడం నిమిత్తం విరాళం అందజేసిన ఎనికేపల్లి శ్రీనివాసరావు

ఇంద్రకీలాద్రి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దుర్గమ్మ ఆలయ గోపురానికి బంగారు తాపడానికి శనివారం ఏలూరు జిల్లా పూళ్ళ గ్రామా నికి చెందిన ఎనికేపల్లి శ్రీనివాసరావు రూ. 1,51,116 విరాళాన్ని చెక్కు రూపంలో అందచేశారు. ఆలయంలో అన్న వితరణ నిమిత్తం విజయవాడకు చెందిన ఎన్ వెంకట నాగేశ్వరరావు పేరిట ఆయన కుటుంబ సభ్యులు రూ.లక్ష అందచేశారు.

● ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయంలోని విమానగోపుర స్వర్ణమయ పథకం ట్రస్టునకు ఇడిముడి శ్రీను రూ.1.51 లక్షలను విరాళంగా అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ ఏఈవో విరాళం బాండు అందించారు.

పరీక్షార్థుల్లో 'నన్నయ' విద్యార్థులే ఎక్కువ

దివాన్‌చెరువు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నత విద్యలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయాల పరిధిలోనే ఎక్కువ మంది పరీక్షలు రాస్తారని ఉపకులపతి ఆచార్య ప్రసన్నశ్రీ అన్నారు. అందుకే పరీక్షల నిర్వహణపై కళాశాలల యాజమాన్యాలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నన్నయ విశ్వవిద్యాలయం అనుబంధ డిగ్రీకళాశాలల్లో సోమవారం నుంచి డిగ్రీ, బీఈడీ, లా పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో శనివారం రాజమహేంద్రవరంలోని ఎస్కేవీటీ డిగ్రీ కళాశాల, రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాలలను వీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని 109 పరీక్షా కేంద్రాల్లో దాదాపు 22 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారన్నారు. అలాగే బీఈడీ, బీపీఈడీ, డీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షల నిమిత్తం 20 కేంద్రాల్లో 2500 మంది, లా 8, 10 సెమిస్టర్ పరీక్షలకు మూడు కేంద్రాల్లో 500 మంది హాజరవుతారని చెప్పారు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అన్ని పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లును కళాశాల నిర్వాహకులు పర్యవేక్షించాలని తెలిపారు.



ఎక్స్‌పో బ్రోచర్లు చూపుతున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు

నరసాపురం లేసుకు ప్రత్యేక గుర్తింపు

హ్యాండీక్రాఫ్ట్స్ ఎక్స్‌పో ప్రారంభించిన కేంద్ర మంత్రి

నరసాపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ స్థాయి ఉత్పత్తుల్లో నరసాపురం లేసు అల్లికలకు ప్రత్యేక గుర్తింపు ఉందని, ఆ ఘనత స్థానిక మహిళలకే దక్కుతుందని కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. రుస్తుంబాదా లేసు ట్రేడింగ్ సెంటర్‌లో నిర్వహించిన హ్యాండీక్రాఫ్ట్ ఎక్స్‌పో ఎగ్జిబిషన్‌ను మంత్రి నిమ్మల రామానాయుడుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రపంచ మార్కెట్ కొత్త ట్రెండ్‌ను కోరుకుంటుందన్నారు. దానికి అనుగుణంగా మహిళలు ఉత్పత్తులు చేస్తే ఆర్థికంగా నిలదొక్కుకుంటారన్నారు. వివిధ రాష్ట్రాల్లోని హస్తకళాకారుల్ని ఒక చోటకు చేర్చి ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మంత్రి రామానాయుడు మాట్లాడుతూ రానున్న రోజుల్లో చేతివృత్తుల కళలకు ఎన్నో అవకాశాలు ప్రభుత్వం కల్పించేందుకు సిద్ధంగా ఉందన్నారు. విప్ నాయకర్ మాట్లాడుతూ లేసు పరిశ్రమకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వాలు అందిస్తున్న శిక్షణలను వినియోగించుకుని మహిళలు నైపుణ్యాన్ని పెంచుకోవాలన్నారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ నరసాపురం లేసు ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా ఉన్న బ్రాండ్ చెరగదన్నారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి, కొవ్వలి నాయుడు ప్రసంగించారు. అనంతరం సెంటర్‌లో ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఈపీసీహెచ్ ఈడీ ఆర్‌కె వర్మ, కలవకొలను తులసీ, తాతాజీ, రాజీవ్ పాల్గొన్నారు.

తణుకులో ట్రాన్స్‌జెండర్ల ఆందోళన



తణుకు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అనకాపల్లిలో ట్రాన్స్‌జెండర్ దీపును హత్య చేసిన దుర్గా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని శనివారం సాయంత్రం ట్రాన్స్ జెండర్లు నరేంద్ర సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. దీపును దారుణంగా హత్య చేసిన ఇరగవరం మండలం పొదలాడ గ్రామానికి చెందిన దుర్గా ప్రసాద్‌ను ఉరితీయాలని అన్నారు. ఎక్కడో ఉన్న దీపుతో సహజీవనం చేస్తున్న దుర్గా ప్రసాద్ ఇటీవల దారుణంగా హత్య చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు సర్పకన్య, నాయకమ్మ, దివ్య పాల్గొన్నారు.

సీలేరు నుంచి నీటి విడుదల పెంపు

ధవళేశ్వరం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గోదావరి డెల్టాలో వ్యవసాయ అవసరాల కోసం సీలేరు నుంచి బైపాస్ మార్గం ద్వారా మరో 1000క్యూసెక్కులు పెంచి 4వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా 3వేల క్యూసెక్కులకు పైగా గోదావరికి విడుదల అవుతోంది. దీంతో గోదావరిలో నీటి లభ్యత 10,700క్యూసెక్కులుగా నమోదైంది. కాటన్ బ్యారేజ్ నుంచి వ్యవసాయ అవసరాల కోసం డెల్టా కాలువలకు 10,700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టాకు 3200 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 2000 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 5500 క్యూసెక్కులు విడుదల అవుతోంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం 9.85 అడుగులుగా నమోదైంది.

ధర్నా, రాస్తారోకో జయప్రదం చేయండి

ఏలూరు రూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కోకో గింజలు కొనుగోలు చేయాలని, అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24, 25 తేదీల్లో మండలాల్లో ధర్నాలు, రాస్తారోకో నిర్వహించాలని, కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి కె.శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శనివారం ఏలూరు మండలం చొదిమెళ్లలో కోకో రైతుల సంఘం నాయకులు పర్యటించి సమస్యలడిగి తెలుసుకున్నారు. ధర సమస్యపై ఉద్యానశాఖ రాష్ట్ర డైరెక్టర్ సమక్షంలో చర్చలు జరిగినా ఫలితంలేదన్నారు. ప్రభుత్వం జోక్యం చేసుకుని సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు కె.సతీష్‌బాబు, పి.నాని, పి.సుధాకర్, కోకో రైతులు పాల్గొన్నారు.

హద్దులు చెరిపేస్తున్నారు..!

ముమ్మరంగా వైఎస్ఆర్ భూరక్ష సర్వే రాళ్ల తొలగింపు పనులు



పొలాల్లో తొలగించిన సర్వే రాళ్లు

ఏలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): గతంలో వైసీపీ ప్రభుత్వం వైఎస్ఆర్ భూ రక్ష పథకం అంటూ సర్వేరాళ్లతో హద్దులను నిర్దే శించారు. తీరా ఆచరణలో ఈ పథ కం ఫెయిల్ అయ్యింది. అధికారం లోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం ఇప్పుడు భూముల రీ సర్వేతో స మూలంగా సర్వే రాళ్ల తొలగింపును చేపట్టింది. గత ప్రభుత్వం ఆర్భాటా లకు పోయి కోట్ల ఖర్చుపెట్టి ఇష్టా రాజ్యంగా బండల్లాంటి రాళ్లను సర్వే రాళ్లుగా మలిచి దౌర్జన్యంగా భూము ల్లోకి దించేశారు. వీటిని పూర్తిగా తొలగించాలన్న నూతన ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం కొద్ది నెలలు క్రితం నుంచి చేస్తున్న కసరత్తు పూర్తి అయ్యే దశకు వచ్చింది. జగనన్న భూ హక్కు రక్ష పథకం కింద పెద్ద ఎత్తున సర్వే రాళ్ల ఏర్పాటు కోసం ముడి సరుకును గ్రానైట్ పరిశ్రమలకు రప్పించారు. నాపరాళ్ల తయారు చేసి వారికి అందించి వారి నుంచి నిర్దేశిత నమూనాలో సర్వే రాళ్లను తయారు చేయించి తెప్పించి గ్రామాల్లో హద్దులను నిర్దేశించారు.

ఏలూరు జిల్లాలో 91.86 శాతం రాళ్లు తొలగింపు

ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేసిన సర్వే రాళ్ల తొలగింపు ప్రక్రియ ఏలూరు జిల్లాలో 91.86 శాతం మేర పూర్తి అయ్యింది. త్వరలో జరిగే జిల్లా కలెక్టర్ల సదస్సులో ఈ అంశంపైన సమీక్ష జరిగే అవకాశం ఉంది. భూముల రీ సర్వే తర్వాత ఈ రాళ్లను తిరిగి ఉపయోగించే అవకాశం ఉంది. జిల్లాలో 245 గ్రామాల్లో 2,87,522 రాళ్లను అప్పటి ప్రభుత్వం సరఫరా చేసింది. ఇందులో ఏలూరు రెవెన్యూ డివిజన్‌లోని 101 గ్రామాల్లో లక్షా2వేల930 ఏర్పాటు చేయగా, ఇందులో 99,125, జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని 104 గ్రామాల్లో లక్షా42వేల325కు గాను లక్షా25వేల557, నూజివీడు డివిజన్‌లోని 40 గ్రామాల్లో 42,267 రాళ్లకు 39,433 సర్వే రాళ్లను తొలగించారు. ఈ సమాచారాన్ని సీఎంకు జిల్లా యంత్రాంగం నివేదించనుంది.

వెళ్లిపోదాం!

- నిర్వాసితుల తరలింపునకు రంగం సిద్ధం
- జూన్ నెలలో 16 గ్రామాల్లోని 1554 కుటుంబాల తరలింపు
- రూ.354 కోట్ల పరిహారం అందజేత
- 18 సంవత్సరాలు పరిహారానికి కటాఫ్ 2017 జూన్ 6
- ఐటీడీఏ పీవో, ఆర్‌అండ్‌ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్





బుట్టాయగూడెంలో నిర్మించిన నిర్వాసితుల కాలనీ.. ఐటీడీఏ పీవో రాములు నాయక్

బుట్టాయగూడెం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జూన్ నెలలో వర్షాలు ప్రారంభానికి ముందే 41వ కాంటూరు పరిధిలోని నిర్వాసితులను తరలించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కెఆర్ పురం ఐటీడీఏ పీవో, ఆర్‌అండ్‌ఆర్ ఆఫీసర్ కె.రాములు నాయక్ తెలిపారు. శనివారం తనను కలిసిన 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వలన 29 గ్రామాలు ముంపునకు గురవుతుండగా 45 కాంటూరును 41లో కలపడం వలన అదనంగా మరో 16 గ్రామాలు ముంపునకు గురవుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు.

తరలించే గ్రామాలు ఇవే..

ఈ ఏడాది జూన్‌లో వేలేరుపాడు మండలంలో 14, కుక్కునూరు మండలంలోని 2 మొత్తం 16 గ్రామాలైన ఎడవల్లి, బొల్లపల్లి, కాచరం, కాకిన్నూర్, పెదమానుకొల్లు, కొత్తూరు, తురుపుమెట్ట, పేరంటాలపల్లి, యర్రంపేట, సిద్దరాం, చింతలపాడు, చిట్టంరెడ్డిపాలెం, టేకుపల్లి, టేకూరు, పోచారం, లచ్చగూడెంలలోని 1554 కుటుంబాలను తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు రాములు నాయక్ తెలిపారు. 354 కోట్ల రూపాయలు నిర్వాసితులకు పెండింగ్ పరిహారంగా జనవరిలో అందజేశామన్నారు. 45 కాంటూర్‌లోని 16 గ్రామాలను శాట్‌లైట్ ఆధారంగా ముంపునకు గురవుతున్నాయని గుర్తించి 41 కాంటూర్‌లో కలపడం జరిగిందన్నారు. అలా చేయడం వలన 16 గ్రామాల్లోని 1554 కుటుంబాలు ముంపునకు గురవుతున్నాయని గుర్తించామని తెలిపారు.

పునరావాస కాలనీలు ఇవే..

నిర్వాసితులను బుట్టాయగూడెం, పోలవ రం, జీలుగుమిల్లి మండలాల్లో ఇప్పటికే నిర్మించిన పునరావాస కాలనీలకు తరలిస్తామని రాములు నాయక్ తెలిపారు. అవార్డు పాస్ చేయడానికి 16 గ్రామాల్లో గ్రామసభలు పెట్టామని ఇప్పటికే 5 గ్రామాల్లో నివేదికలు సిద్ధం చేసి ధవళేశ్వరం ఆర్‌అండ్‌ఆర్ ప్రత్యేక అధికారికి సమర్పించినట్లు తెలిపారు. మిగిలిన గ్రామాల్లో కూడా మార్చి, ఏప్రిల్ నెలాఖరుకు అవార్డు కోసం నివేదికలు పూర్తి చేస్తామన్నారు.

కాలనీల్లో సౌకర్యాలు కల్పిస్తాం

నిర్వాసితుల తరలింపునకు ఆయా మండలాల్లో కాలనీల నిర్మాణాలు పూర్తిచేయగా నిర్వాసితులు కాలనీలకు వెళ్ళకపోవడంతో తలుపులు, కిటికీలు ఇతర కట్టడాలు పాడైపోయినట్లు గుర్తించామని వాటిని బాగుచేసిన తర్వాతనే నిర్వాసితుల తరలింపు ఉంటుందన్నారు. వీటితోపాటు కాలనీల్లో రోడ్లు, విద్యుత్, మంచినీరు ఇతర మౌలిక సదుపాయాలను కల్పించాలని అందుకోసం 104 కోట్ల రూపాయలు సిద్ధంగా ఉన్నా యన్నారు. కాలనీల్లో సమస్యలను గుర్తించి మే నెలాఖరుకు పూర్తిచేసి జూన్‌లో నిర్వాసితులను కాలనీలకు తరలించడం చేపడతామన్నారు. ఆర్‌అండ్‌ఆర్‌కు సంబంధించి ఇంకా 283 కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు ఆఫీసర్ రాములు నాయక్ తెలిపారు. ఆర్‌అండ్‌ఆర్‌లో 18 సంవత్సరాలు నిండినవారికి పరిహారం అందించాలంటే 2017 జూన్ 6వ తేదీని కటాఫ్ డేట్‌గా గుర్తించినట్లు తెలిపారు. అంతకుముందువారికే పరిహారం అందుతుందన్నారు. కటాఫ్ డేట్ మార్చాలని గిరిజనులు కోరుతున్నారని దీనితోపాటు ఇతర సమస్యలను తన దృష్టికి తీసుకువస్తున్నారని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్క రించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనలను కాదని తామేమి చేయకూడదని స్పష్టం చేశారు.

పోలీస్ స్టేషన్ నుంచి నిందితుడి పరారీ

ఆపసోపాలు పడి పట్టుకున్న పోలీసులు

భీమవరం క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం ఒక మహిళ లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేసింది. ఆ కేసులో నిందితుడిగా ఉన్న ఒక వ్యక్తిని భీమవరం పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే శుక్రవారం రాత్రి పోలీసులు అప్రమత్తంగా లేకపోవడంతో ఆ వ్యక్తి పరారైనట్లుగా తెలుస్తుంది. దీంతో అధికారులు అప్రమత్తమై పలు బృందాలను గాలించడానికి పంపించారు. భీమవరం బస్టాండ్ వద్ద శనివారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లుగా సమాచారం. గతంలో కూడా ఆ పోలీస్ స్టేషన్‌కు సంబంధించి ఒక కేసులో నిందితుడిని కోర్టుకు తీసుకువెళుతుండగా పరారయ్యాడు. అప్పుడు పోలీసులు అప్రమత్తమై గాలించి నిందితుడిని పట్టుకున్నారు.

విద్యార్థి మృతదేహం లభ్యం

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 22 (ఆంధ్ర జ్యోతి): పెంటపాడు మండలం పరిమెళ్లలో ఈతకు వెళ్లి గల్లంతైన ఇంజనీరింగ్ విద్యార్థి పల్లెపోగు వరప్రసాద్ (20) మృత దేహం శనివారం లభ్యమైంది. వరప్రసాద్ శుక్రవారం స్నేహితులతో సరదాగా ఈతకోసం వెళ్లి ప్రమాదవశాత్తూ కాలువలో గల్లంతయ్యాడు. వరప్రసాద్ ఆచూకి కోసం పోలీస్, అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం రాత్రి వరకూ గాలించినా లభ్యం కాలేదు. చివరికి శనివారం కిలోమీటరున్నర దూరంలోని వెస్ట్ విప్పర్రు సమీపంలో లభ్యమైంది. గుంటూరుకు చెందిన తల్లిదండ్రులు వరప్రసాద్ మృతదేహాన్ని చూసి దుఃఖ సాగరంలో మునిగిపోయారు.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

మొగల్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): బైక్‌పై వెళుతుండగా జారి పడిన సంఘటనలో మహిళ మృతి చెందిన ఘైనమిది. హెడ్ కానిస్టేబుల్ జొనాతన్ తెలిపిన వివరాల ప్రకారం భీమవరం మండలం వెంప పంచాయతీ పరిధి కొత్తపేటకు చెందిన మోతుకూరి మంగామనోహర్ అయన భార్య లక్ష్మీ (38) శుక్రవారం వారి ఇంటి నుంచి మొగల్తూరుకు బైక్‌పై వస్తున్నారు. అడవి మల్లిఖార్జునస్వామి ఆలయ సమీపం వద్దకు వచ్చే సరికి వీరి బైక్‌కు గేదె అడ్డురావడంతో మనోహర్ షడన్ బ్రేక్ కొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న లక్ష్మీ కిందపడి తీవ్రంగా గాయాలపాలైంది. 108 వాహనంలో భీమవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ శనివారం మృతి చెందిదని హెడ్ కానిస్టేబుల్ వివరించారు.

తెలంగాణలో 120 కేజీల
గంజాయి పట్టివేత



నిందితులను అరెస్టు చేసిన తెలంగాణ పోలీసులు

కుక్కునూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణాలోని బూర్గంపాడు గ్రామ శివారుల్లో 60లక్షల 57వేలు విలువ చేసే 120కేజీల గంజాయి పట్టుబడింది. దీనిపై భద్రాద్రికొత్తగూడెం జిల్లా బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో పాల్వంచ డీఎస్పీ సతీష్ విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శనివారం బూర్గంపాడు గ్రామ శివారు సమక్కసారక్క గద్దెల వద్ద ఎస్ఐ ఈ.రాజేశ్ సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో గంజాయి తరలిస్తూ వాంకుడోతు సాయికుమార్, పెదముత్యం వంశీ పట్టుపడ్డారు. అనంతరం వారిని విచారించారు. ఎస్‌కే మన్వర్, రమేష్, కే.సురేష్, జగదీష్, వీ.సాయి కుమార్, కలిసి గంజాయివ్యాపారం చేయాలనుకున్నారు. గతంలో వీరు గంజాయి వ్యాపారం నిర్వహించారు. ఈ క్రమంలో షోలాపూర్‌కు చెందిన వీ.సురేష్‌తో కలిసి గంజాయిని ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో భద్రాచలం వద్ద కారును అద్దెకు తీసుకుని మోటు అనే గ్రామానికి వెళ్ళి అక్కడ బీమా అనే వ్యక్తి వద్ద 55ప్యాకెట్ల మొత్తం బరువు 121.140 గంజాయిని కొని కుక్కునూరు మండలం వింజరం వద్ద పడవసాయంతో గోదావరి ఇవతలకు దాటారు. అనంతరం కుక్కునూరు మండలంలోని పలు గ్రామాలను ఆంధ్ర తెలంగాణ సరిహద్దులను దాటి బూర్గంపాడులో ప్రవేశించారు. పోలీసుల తనిఖీలో వారు గంజాయితో పట్టుబ డ్డారు. కాగా ఈ కేసులో ప్రస్తుతం ఇద్దరుపట్టుబడగా మరికొందరు పరారీలో ఉన్నట్లు తెలిపారు.



రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

న్యాయం చేయాలంటూ బంధువుల ఆందోళన.. పోస్టుమార్టం నిలిపివేత

ఏలూరు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తమకు న్యాయం చేయాలని మృతుని బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళనకు దిగారు. పెదవేగి మండలం వేగివాడలోని ఎమ్మార్పీ కాలనీకి చెందిన ఘంటా భరత్ కుమార్ (22) ఒక ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంటుగా పనిచేస్తున్నాడు. ఈ నెల 21వ తేదీన భీమడోలు రైల్వే గేటు సమీపంలో జాతీయ రహదారిపై అకస్మాత్తుగా భరత్ కుమార్ కుడివైపు తిరగడంతో అదే సమయంలో వెనుక నుంచి వచ్చిన ఒక కారు ఢీ కొంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన అతనిని ఏలూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే కారు యజమాని నష్టపరిహారం కట్టాలని అప్పటి వరకు మృత దేహాన్ని పోస్టుమార్టం చేయనివ్వమంటూ, కారు యజమాని రావాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రి ముందు రోడ్డుపై శనివారం మధ్యాహ్నం కొద్దిసేపు ఆందోళన చేసి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగించారు. టూటౌన్ పోలీసులు వారిని అక్కడ నుంచి పంపించి వేశారు. అయితే న్యాయం జరిగే వరకూ పోస్టుమార్టం జరిగే వరకూ వీలు లేదని డిమాండ్ చేశారు. అయితే పోస్టుమార్టం చేసే సమయం అయిపోయిందని వైద్యులు వెళ్ళిపోయారు. ప్రస్తుతం మృత దేహం ఆసుపత్రి మార్చురీలో ఉంది.

హంతకులకు శిక్షపడేలా కష్టపడ్డారు

అభినందించి ప్రశంసాపత్రాలు అందించిన ఎస్పీ



ఎస్పీ నుంచి ప్రశంసా పత్రం అందుకుంటున్న జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర

ఏలూరు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ జంటపై దాడిచేసి యువతిపై అత్యాచారం, ఆపై హత్య చేసి ప్రేమికుడి పై హత్యాయత్నానికి పాల్పడిన నలుగురికి జీవిత ఖైదు పడే విధంగా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ కేపీఎస్ కిషోర్ ప్రశంసించి, ప్రశంసాపత్రాలు, నగదు పురస్కారాలను అందించారు. 2019 ఫిబ్రవరి 24న కామవరపుకోట మండలం జీలకర్రగూడెం (బౌద్ధారామాల కొండ) గట్టుపైకి వెళ్ళిన ప్రేమ జంటపై నలుగురు జంతువేటగాళ్ళు దాడిచేసి, బెదిరించి యువతిపై అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ కేసు నమోదు చేసిన తడికలపూడి పోలీసులు నలుగురిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసు ఏలూరులోని ఫోక్సో కోర్టులో విచారణ సాగింది. ఆ నలుగురికి శుక్రవారం జీవితఖైదు విధించారు. కేసు దర్యాప్తులో సాక్ష్యులను సకాలంలో హాజరు పర్చడంలో విశేష కృషి చేసి పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ ప్రశంసించారు. ఈ సందర్భంగా అప్పటి చింతలపూడి సీఐ యుజె విల్సన్, పి.రాజేష్, ప్రస్తుతం జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, జంగారెడ్డిగూడెం సీఐ బి.కృష్ణబాబు, తడికలపూడి ఎస్ఐ చెన్నారావు, టి నర్సాపురం ఎస్ఐ జయబాబు, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, కోర్టు మానిటరింగ్ సెల్ ఇన్‌చార్జి ఎం.సుబ్బారావు, తడికలపూడి కానిస్టేబుల్ కేపీవీడీఎన్ కొండలరావు, కోర్టు మానిటరింగ్ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసరావు, మహిళా హెడ్‌కానిస్టేబుల్ ఎం వెంకట రమణ, కానిస్టేబుల్ పి.రవికుమార్‌లకు ప్రశంసాపత్రాలను ఎస్పీ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎన్ఎస్ఎస్ శేఖర్, డీఎస్పీలు డి శ్రావణ్‌కుమార్, ఎం.వెంకటేశ్వరరావు, యు.రవిచంద్ర, ప్రసాదరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ హబీబ్ బాషా, ఎస్ఐ రాజారెడ్డి, ఐటీ కోర్ ఇన్‌చార్జి నరేంద్ర పాల్గొన్నారు.



విచారణ నిర్వహిస్తున్న డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్

కూలీ ఆత్మహత్య

పెదపాడు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : యజ మాని మందలించడంతో మనస్తాపానికి గురైన వ్యక్తి ఉరి వేసుకుని మృతి చెందినట్లుగా పెదపాడు ఎస్ఐ కట్టా శారద సతీశ్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం పెదపాడు మండలం వెంకటాపురానికి చెం దిన మిండాల సాయి (28) కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య మాధవి, నాలుగేళ్ల కుమార్తె ఉన్నారు. సాయి పనిచేసే చోట యజమాని మందలించడంతో తీవ్ర మనస్తాపానికి గురై ఇంటిలో శుక్రవారం ఉరి వేసుకుని మృతి చెంది నట్లుగా మృతుని తమ్ముడు శ్రీను పెదపాడు పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. సమాచారం అందుకున్న పెదపాడు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి శనివారం తరలించారు. డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐ కె.వెంకటేశ్వరరావు మృతుని బంధువులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

ఆర్అండ్‌బీ, రైల్వే శాఖల అధికారులతో ఎంపీ పుట్టా సమీక్ష

ఏలూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : రైల్వే, ఎన్‌హెచ్, ఆర్అండ్‌బీ శాఖల ఉన్నతాధికారులతో ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ సమీక్ష నిర్వహించారు. ఉంగుటూరు, దెందులూరుల్లో రైల్వే, జాతీయ, ఆర్అండ్‌బీ రహదారుల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రులను కలిసి కోరినట్లు ఎంపీ తెలిపారు. గుర్తిం చిన పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంపీ అధికారులను కోరారు. కొత్తపేటలో జరుగుతున్న నూకాలమ్మ జాతరలో పాల్గొని ఆలయం పట్టు వస్త్రాలను మేళ తాళాల మధ్య సమర్పించారు.

శ్రీవారి సేవలో ఎమ్మెల్సీ ఆలపాటి

ద్వారకాతిరుమల, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయాన్ని కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం ఉదయం సందర్శించారు. ఆలయ ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



చిత్ర పటం అందజేస్తున్న ఈవో

'దొండపాడు అభివృద్ధికి రూ.కోటి కేటాయిస్తాం'

ఏలూరు టూటౌన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : దొండపాడు అభివృద్ధికి రూ.కోటి కేటాయిస్తున్నట్టు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు.26వ డివిజన్ దొండపాడులో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్‌లు పర్యటించారు. ఈ సందర్భంగా చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ దొండపాడు కార్పొరేషన్‌లో విలీనమైనా కానీ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. దొండపాడులో 450మీటర్ల రోడ్డు నిర్మాణం చేపడతామన్నారు.కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు తేనె సేకరణ పెట్టెలు అందజేత

పోలవరం మార్చి 22(ఆంధ్రజ్యోతి) : గిరిజనులు స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు సూచించారు. శనివారం పోలవరం మండలం రెడ్డికుంకాల గ్రామంలో కోట రామచంద్రపురం ఐటీడీఏ ట్రైకార్ సౌజన్యంతో గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గిరిజనలకు తేనె సేకరణ పెట్టెలు ఉప పరికరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ 31 మంది గిరిజన రైతులకు తేనె పెట్టెలు ఉప పరికరాలు అందజేసినట్టు తెలిపారు. గిరిజన వికాస్ సంస్థ డైరెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులకు గత నెలలో తేనె సేకరణపై శిక్షణ ఇచ్చి గిరిజన వికాస్ స్వచ్ఛంద సేవా సంస్థ సేవలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ప్రాజెక్టు రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకి, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులుకి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాములు నాయక్‌కి కృతజ్ఞతలు తెలిపారు.

కొబ్బరి రైతులకు రాయితీపై ఎరువుల పంపిణీ

పెదవేగి, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : కొబ్బరి సాగును మరింత ప్రోత్సహించేందుకు రాయితీపై ఎరువులను అందిస్తున్నామని కొబ్బరి అభివృద్ధి సంస్థ క్షేత్ర స్థాయి అధికారి ఎం.కిరణ్ కుమార్ అన్నారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొబ్బరి అభివృద్ధి సంస్థ ద్వారా సరఫరా చేసిన ఎరువులను కొబ్బరి రైతులకు అందించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి అధికారి కిరణ్ కుమార్ మాట్లాడుతూ కొబ్బరి అభివృద్ధి సంస్థ ద్వారా రైతులను ప్రోత్సహించడానికి రాయితీపై ఎరువులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పి.నరసింహరావు, బి.వెంకటరెడ్డి, మంతెన బాబూరావు, అబ్బూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఏ బకాయిలను వెంటనే చెల్లించండి : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయి డీఏలను బ్యాంకు ఖాతాలకు జమచేసేలా చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు టి.రామారావు డిమాండ్ చేశారు. సంబంధిత బకాయిల బిల్లులను ట్రెజరీలో పాస్‌చేసినట్టుగా అప్పటి ప్రభుత్వం మోసపూరితంగా చూపించడంతో పాటు, సదరు బిల్లులకు ఆదాయపు పన్ను కూడా వసూలు చేసిందని వివరించారు. ఈ బకాయిలను ఈ ఏడాది మార్చి లోగా ఆరు విడతల్లో చెల్లించేందుకు అప్పటి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

టి.నర్సాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. వల్లంపట్ల, పుట్రేపు గ్రామాల్లో సబ్‌స్టేషన్ నిర్మాణానికి సేకరిం చిన స్థలాలను, తీగలపల్లిలో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్‌ను శనివారం ఆయ న పరిశీలించారు. మండలంలోని ఏపిగుంటలో ఉపాధి పథకం ద్వారా నిర్మిం చనున్న ఫారమ్ పాండ్ నీటి గుంటలకు శంకుస్థాపన చేశారు. ఈ సంద ర్భంగా బాలరాజు మాట్లాడుతూ మండలంలో వ్యవసాయానికి విద్యుత్ సరఫ రాలో హెచ్చుతగ్గుల కారణంగా రైతులు ఇబ్బందులుపడుతున్నారని తమ దృష్టికి వచ్చినట్టు తెలిపారు. లోఓల్టేజ్ సమస్య ఉన్నచోట విద్యుత్ సమస్యలు పరిష్కరించి 24గంటల విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, జనసేన మండల కన్వీనర్ నాగరాజు, మాజీ జడ్పీటీసీ సభ్యులు అల్లూరి వెంకట చలపతిరావు, టీడీపీ మండల అధ్యక్షుడు నాయుడు రామకృష్ణగౌడ్ పాల్గొన్నారు.

సీఆర్ఆర్‌లో ఉచిత కంటి వైద్య శిబిరం

ఏలూరు అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : సీఆర్ఆర్ పీజీ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఉచిత కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. రవి కిరణ్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో సుమారు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వయస్సు, ఆరోగ్యం, అవసరాన్ని బట్టి సంవత్సరానికి ఒకసారి కంటి పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ జి.హేమలత సూచించారు. కళాశాల డైరెక్టర్ యలమర్తి బాబు, కరస్పాండెంట్ కె.శ్రీనివాసరావు, ఎంబీఏ డైరెక్టర్ ఆర్.శ్రీనివాసరావు, కో-ఆర్డినేటర్ టి.రాజేశ్ పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దాడులను ఖండించిన సీపీఎం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) :పాలస్తీనా - గాజాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.బలరాం, మంతెన సీతారాంలు పేర్కొన్నారు.శనివారం ఏలూరులోని సీపీఎం కార్యాలయంలో ఆ పార్టీ కార్యదర్శి వర్గసభ్యులు డి.ఎన్.వి.డి.ప్రసాద్ అధ్యక్షతన సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రజలు, రైతాంగం, వ్యవసాయ కార్మికులు, కార్మికులు సమస్యలపై పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బి.బలరాం, మంతెన సీతారాం మాట్లాడుతూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ గాజాపై ఇజ్రాయెల్ దాడి చేయడంతో వందలాది మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా ప్రోద్బలంతోనే ఇజ్రాయెల్ ఈ దాడులకు పాల్పడుతుందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, ఆర్.లింగరాజు, జి.రాజు, పి.రామకృష్ణ, కె.శ్రీనివాస్, ఎం.జీవరత్నం, ఎ.ఫ్రాన్సిస్, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు పాల్గొన్నారు.

పట్టెన్నపాలెం బ్రిడ్జి నిర్మాణానికి టెండర్లు

జంగారెడ్డిగూడెం, మార్చి22(ఆంధ్రజ్యోతి) :పట్టెన్నపాలెం బ్రిడ్జి నిర్మాణానికి ఏప్రిల్ 9న టెండర్ల ప్రక్రియ మొదలుకానుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు తెలిపారు. శనివారం ఏలూరులోని ఎంపీ మహేష్ కార్యాలయంలో దాసరిశేషు మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.రెండు నెలల్లో ఏలూరు - జంగారెడ్డిగూడెం రోడ్డు నిర్మాణం పూర్తవుతుందని ఎంపీ హామీ ఇచ్చారని శేషు తెలిపారు. అలాగే జంగారెడ్డిగూడెంలోని బైనేరు వంతెన నిర్మాణ పనులకు త్వరలోనే టెండర్లు పిలువనున్నట్లు ఎంపీ తెలియజేశారన్నారు.

బోదవ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు : ప్రియాంక

లింగపాలెం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలోనే గుర్తిస్తే బోద వ్యాధి నివారణ సాధ్యమని డాక్టర్ ప్రియాంక అన్నారు. మండలంలో ధర్మాజీగూడెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో బోదవ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి చింతలపూడి సబ్‌యూనిట్ ఆఫీసర్ ప్రసాద్ హాజరయ్యారు. అనంతరం ఎండల తీవ్రత, వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రామ్మోహన్, సారథి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణలో రెవెన్యూ పోస్టుల పట్ల హర్షం

ఏలూరురూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) :తెలంగాణ రాష్ట్రంలో గత టీఆర్ఎస్ ప్రభుత్వం తీసివేసిన గ్రామ రెవెన్యూ వ్యవస్థను తిరిగి పునరుద్ధరిస్తూ జీవో ఇవ్వడం పట్ల ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం హర్షం ప్రకటించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు భూపతి రాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖా మంత్రి శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థ తీసివేయడంతో అక్కడి రైతులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని, ఇది గమనించిన కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి గ్రామ రెవెన్యూ వ్యవస్థను పునరుద్ధరించడం హర్షణీయమన్నారు.

రక్షణ గోడలు నిర్మించండి మహాప్రభో..

ఏలూరుకార్పొరేషన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి జూట్‌మిల్లు సెంటర్ వరకు ఉన్న రైల్వే ఫ్లైవోవర్ బ్రిడ్జిపై ప్రయాణం వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. జూట్‌మిల్లు నుంచి ఓవర్ బ్రిడ్జి ఎక్కే ప్రాంతంలో, దిగే ప్రాంతంలో రెండు వైపులా రక్షణ గోడ కూలిపోయింది. ఈ రెండు చోట్ల రక్షణ గోడలు కూలిపోవడంతో వాహనదారులకు రక్షణ కరు వైంది. తరచూ ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. అయినప్పటికీ రక్షణ గోడలు నిర్మించకపోతే ఎలా అంటూ ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తు న్నారు. ఎటువంటి ప్రాణ నష్టాలు జరగకముందే ఫ్లైవో వర్‌పై రక్షణ గోడలు నిర్మించాలని వాహనదారులు, స్థానికులు కోరుతున్నారు. నిత్యం వాహనాల రాకపోకలు సాగించే ఇలాంటి రద్దీ ప్రాంతంలో రక్షణ గోడలు నిర్మించకపోతే ఎలా అంటూ వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



బ్రిడ్జికి రెండు వైపులా కూలిపోయిన రక్షణ గోడలు

నీటి కొరతను అధిగమించే బాధ్యత అందరిదీ : జడ్జి బులికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బులికృష్ణ

పెదవేగి, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : సమాజం నీటి కొరతను ఎదుర్కొంటోందని, నీటి ఎద్దడి సమస్య పరిష్కారానికి సమిష్టి కృషి, అవగాహన ఒక్కటే మార్గమని ఏలూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కె.కె.వి.బులికృష్ణ అన్నారు. జాతీయ నీటి దినోత్సవం సందర్భంగా శనివారం పెదవేగి మండలం వంగూరులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో నీటిఎద్దడి నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బులికృష్ణ మాట్లాడుతూ మనదేశంలో అవసరాలకు మించి నీటిని వాడేస్తున్నామన్నారు. నీటి లభ్యత, వినియోగం, భవిష్యత్ అవసరాలు వంటివాటిని దృష్టిలో పెట్టుకుని మనం సమిష్టి కృషితో ముందుకెళ్లాలని ఆయన సూచించారు. ఏలూరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి.రచన మాట్లాడుతూ సాంకేతికంగా సమాజాభివృద్ధిని సాధించినప్పటికీ గ్రామాల్లో కొన్ని చోట్ల ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతున్నాయని,ఇది విచారించదగ్గ విషయమన్నారు. బాల్య వివాహ వ్యవస్థను పూర్తిగా నిర్మూలించే విషయంలో ప్రతిఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.రాజేశ్వరీ తేజస్వి, తణుకు మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్ కుమార్, పాలకొల్లు రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ఎల్ లావణ్య, న్యాయవాది పి.రత్నరాజు, పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

భూగర్భ జలాల పెరుగుదలకు పంట కుంటలు దోహదం



ధర్మాజీగూడెంలో పంటకుంటను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చింతలపూడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : భూగర్భ జలాలు నిలకడగా ఉండేందుకు ప్రభుత్వం పంట కుంటల పథకం తెచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రోజు ఈ పనులు ప్రారంభించాలని ఆదేశాలతో మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో పంట కుంటల తవ్వకాలను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రగడవరం పంచాయతీ మెట్టగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఉపాధి ఏపీఎం ఎస్.మోహినికుమారి మాట్లాడుతూ మార్చి నుంచి జూన్ వరకు మండలంలో 285 ఇంకుడుగుంతలు తవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు టి.చంద్రశేఖరరెడ్డి, కె.రాజారెడ్డి, కెటీఆర్ పాల్గొన్నారు.

● పోలవరం :ప్రగడపల్లి పంచాయతీలో శనివారం ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట సంజీవని కార్యక్రమానికి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్ బాబు మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో పంటల సంరక్షణ కోసం పంట కుంటలు ఎంతో ఉపయోగకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ గంగరాజు, ఎంపీటీసీ దాపర్తి మోహనరావు పాల్గొన్నారు.

● లింగపాలెం : ధర్మాజీగూడెంలో పంట కుంటల ఏర్పాటుకు సంబంధించిన పనులను ఎమ్మెల్యే రోషన్‌కుమార్ ప్రారంభించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులకు పంటకుంటలు ఎంతగానో సహకరిస్తాయన్నారు.ఈకార్యక్రమంలో డ్వామా ఏపీడీ శ్రీదేవి, ఎంపీడీవో కె.వాణి, ఇంచార్జ్ తహసీల్దార్ ప్రసాద్, ఏపీఎం వరలక్ష్మి, జి.చలపతిరావు పాల్గొన్నారు.

● వేలేరుపాడు : భూగర్భ జలాలను పెంపొందించేందుకు పంట కుంటలు ఎంతగానో దోహదం చేస్తాయని వేలేరుపాడు ఎంపీడీవో ఎం.శ్రీహరి రైతులకు సూచించారు. శనివారం రుద్రమ్మకోట పంచాయతీ పరిధిలో పంట కుంటల తవ్వకానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రైతులనుద్దేశించి మాట్లాడుతూ నీటి పంట కుంటలు సాగునుకు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● కుక్కునూరు : ఉపాధి హామీ పథకం కింద శనివారం కుక్కునూరు పంచాయతీలో పంటకుంటల తవ్వకం పనులు ప్రారంభించారు. భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఈ కుంటలు తోడ్పడతాయని అధికారులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరసింహరావు, టీడీపీ మండలాధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు ఎం.యుగంధర్, ఎం.వెంకన్నబాబు, తదితరులు పాల్గొన్నారు.



● దెందులూరు : సానిగూడెం పంచాయతీ పరిధిలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పంట కుంటలను జిల్లా డ్వామా పీడీ వెంకట సుబ్బారావు, టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్, ఉపాధి ఇంచార్జీ ఏపీవో పాతిమా ప్రసన్న పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం టీఏలు శ్రావణ్, దీప్తి, ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు.

వైఎస్సార్ కాలనీకి తాగునీరివ్వండి

చింతలపూడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీలో మంచి నీటి సమస్య పరిష్కరించాలంటూ వైఎస్సార్ కాలనీ వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు కాలనీలో సీపీఎం నాయకులు ప్రజా చైతన్య యాత్రగా పర్యటించి సమస్యలు తెలుసుకుని మునిసిపల్ కమిషనర్ డి.పావనికి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు పాండురంగారావు, సూర్యకుమార్ మాట్లాడుతూ దశాబ్దాలు గడుస్తున్నా కాలనీవాసులకు మంచినీరు సౌకర్యం కల్పించలేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

ఏలూరురూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : కొన్ని రోజులుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఏలూరు జనసేన పార్టీకి చెందిన బొత్స శ్రావణ కుమార్ అనే కార్యకర్తకు ఏలూరు జనసేన పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో శనివారం 25 వేల రూపాయల నగదును ఆ పార్టీ నూజివీడు నియోజకవర్గ సమన్వయ కర్త వర్మ ఫణి బాబు చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందచేశారు. వారి నివాసానికి వెళ్ళి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నగిరెడ్డి కాశీ నరేష్, శ్రవణ్‌కుమార్‌గుప్త, సరిది రాజేష్, రెడ్డి గౌరీశంకర్, పెరుమాళ్ల పాల్గొన్నారు.

జీడిమామిడి ఫలసాయం వేలం

చింతలపూడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : కామవరపుకోట మార్కెట్ యార్డులో ఉన్న నాలుగు ఎకరాల్లోని జీడి మామిడి చెట్ల ఫలసాయం బహిరంగ వేలాన్ని 25న ఉదయం 10 గంటలకు యార్డు ఆవరణలో నిర్వహిస్తున్నట్టు చింతలపూడి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎస్.కె.మెహరాజ్ పాషా తెలిపారు. పాటలో పాల్గొనే వారు రూ.రెండు వేలు చెల్లించాలన్నారు.

నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ దాడులు

చింతలపూడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిగూడెంలో జిల్లా ఎక్సైజ్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం విస్తృత దాడులు జరిపారు. ఈ దాడుల్లో 95 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 2 వేల 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఆరుగురిపై కేసులు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో జిల్లా అధికారులు అవులయ్య, పాండురంగారావు, అజయ్‌కుమార్‌సింగ్, సీఐలు పాల్గొన్నారు.

తడికలపూడిలో గడ్డి ట్రాక్టర్ దగ్ధం

కామవరపుకోట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : తడికలపూడిలోని బంకు వద్ద రోడ్డుపక్కన నిలుపుదల చేసిన గడ్డి ట్రాక్టర్‌కు శనివారం విద్యుత్ వైర్లు తగిలి ఒక్కసారిగా మంటలు వ్యాపించి ట్రాక్టర్ గడ్డి దగ్ధమైంది. ఏలూరు అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

ఆలోచనా శక్తి పెంచుకోవాలి



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

పెదపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : ఇంజనీరింగ్ విద్యార్థులు నైపుణ్యతతో కూడిన ఆలోచన శక్తిని పెంపొందించుకోవడం ద్వారా నూతన సాంకేతిక ఆవిష్కరణను రూపొందించే వీలు కలుగుతుందని వట్లూరులోని రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాల ఎం.డి. కె.సాయి రోహిత్ తెలిపారు. రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో బ్రెయిన్ ఓ విజన్ సంస్థ ఆధ్వర్యంలో వేగాకోడ్ పేరుతో రెండు రోజుల జాతీయస్థాయి హాకథాన్‌ను ఈనెల 21, 22వ తేదీల్లో నిర్వహించారు. ఎండీ సాయిరోహిత్ మాట్లాడుతూ నూతన సాంకేతిక అంశాల్లో పట్టు సాధించేందుకు నిరంతర అభ్యాసన, సుశిత పరిశీలన అవసరమని సూచించారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు ప్రాజెక్టులను రూపొందించగా, విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు మురళీధరరావు, కళాశాల డీన్‌లు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరాకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదపాడు, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో సురక్షిత మంచినీటిని ప్రజలకు అందించేందుకు తగిన చర్యలు తీసుకున్నామని, ఇందుకోసం రూ.90 లక్షల నిధులు మంజూరు చేయడం జరిగిందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ బత్తుల రత్నకుమారి అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే చింతమనేని శాఖల వారీగా వివిధ పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మోరు శ్రావణి, లావేటి శ్రీనివాసరావు, బొప్పూడి కాశీబాబు, ఎంపీడీవో అమీలు జమ, సర్పంచిలు, ఎంపీటీసీలు పాల్గొన్నారు. అనంతరం పెదపాడు తహసీల్దారు కార్యాలయం వద్ద రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తహసీల్దారు కృష్ణజ్యోతితో కలిసి శనివారం ప్రారంభించారు.

ఎట్టకేలకు సిల్ట్ కుప్పల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



చింతలపూడి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి నగర పంచాయతీలోని మెయిన్ రోడ్డుకు ఇరుపక్కలా వేసిన సిల్ట్‌ను తరలించకుండా జాప్యం చేస్తున్నారని ఈ నెల 21న 'ఆంధ్రజ్యోతి' లో వచ్చిన వార్తకు మునిసిపల్ అధికారులు స్పందించారు. శనివారం ఉదయం తెల్లవారు జాము నుంచి ఈ సిల్ట్ కుప్పలను తొలగించారు. దీంతో దుకా ణాల ముందు వాహనాలు పెట్టుకోవడానికి పార్కింగ్ సౌకర్యం ఏర్పడింది. కాగా ఈ మార్జిన్‌లో ఫుట్‌పాత్ నిర్మా ణం చేపడితే పాదచారులకు ట్రాఫిక్ సమస్య ఉండదని స్థానికులు కోరుతున్నారు.



ఛానమిల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు

నిడమర్రు మార్చి 22(ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీటవేస్తున్నట్టు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. శనివారం దేవర గోపవరం, ఛానమిల్లి గ్రామాల్లో సీసీ, గ్రావెల్ రోడ్లను ప్రారంభించారు.ఛానమిల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రావెల్ రోడ్లు, రూ.28 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ బేతు వెంకట శివరామారావు,జనసేన పార్టీ మండలాధ్యక్షులు నిమ్మల దొరబాబు, గ్రామపార్టీ అధ్యక్షులు గౌతు వెంకన్న, ఎంపీటీసీ కొత్తల సింహాచలం, సర్పంచ్ నంద్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయండి

ఏలూరుటూటౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముం దుకు రావాలని ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్, ఎమ్మెల్యే బడేటి చంటి పిలుపుని చ్చారు. 24వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ కడియాల విజయలక్ష్మి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే చంటి, ఎంపీ మహేశ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీ మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు దోహదం చేస్తాయన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎంపీ

పేదలకు ఆధునిక వైద్య సేవలు : ఎమ్మెల్యే

పేదలకు ఆధునిక వైద్యసేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం 12మందికి రూ.4లక్షల 32వేలు విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌టీఆర్ వైద్యసేవల ద్వారా పేదవారికి వైద్యం నిమిత్తం పూర్తి భరోసా కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో శివ ప్రసాద్, నాగరాజు. కర్రి శ్రీనివాసరావు, బెల్లంకొండ కిశోర్, తంగిరాల సురేష్, మారం హనుమంతరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రజక సంఘ అధ్యక్షుడు కట్లయ్య

దోబీఘూట్‌లను నిర్మించాలి : కట్లయ్య

ఏలూరురూరల్, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : దోబీ ఘూట్‌లు, రజకుల విశ్రాంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చొరవ చూపాలని రజక జన సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం సంఘ భవనంలో సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి చెరువులు బాగు చేయించాలని, సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు. వృత్తిపరమైన సమస్యలతో రజకులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే దోబీఘూట్‌లు, విశ్రాంతి భవనాల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో చలపతిరావు, కృష్ణ, కె.మురళీ, సాంబశివరావు, శ్రీనివాస్, శేషు, ప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాస్ శిక్షణార్థులకు నేడు పరీక్షలు

ఏలూరురూరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉల్లాస్ వయోజన విద్యలో శిక్షణ పొందిన వారికి ఆదివారం శిక్షణ కేంద్రాల్లో పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఏలూరు ఎంపీడీవో, వెలుగు ఏపీఎం నాగేశ్వరరావు తెలిపారు. శనివారం ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్, విద్యాశాఖ, డీఆర్‌డీఏ ఉద్యోగులతో మండల పరిషత్ కార్యాలయంలో సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఉల్లాస్ పరీక్షల నిర్వహణపై వయోజన విద్య కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, వెలుగు ఏపిఎం, ఎంపీడీవో శ్రీలత శిక్షణనిచ్చారు. ఏలూరురూరల్ మండలంలోని 15 గ్రామాల్లో 31 సెంటర్లలో శిక్షణ నిర్వహించి 310 మందికి వయోజన విద్యను అందించారు. ఈ సందర్భంగా ఉల్లాస్ పరీక్షా మెటీరియల్‌ను అంగన్‌వాడీ టీచర్లకు అందజేశారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని అధికారులు సూచించారు.

చింతలపూడి సబ్ జైల్లో ఖైదీల సౌకర్యాలపై ఆరా

చింతలపూడి, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : సబ్ జైల్‌ను శనివారం జూనియర్ సివిల్ జడ్జి సి.హెచ్.మధుబాబు తనిఖీ చేశారు. ఖైదీలకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఖైదీలలో ఎవరికైనా ఉచిత న్యాయం కావాలంటే అందుకు కోర్టును సంప్రదించాలని తెలిపారు.అనంతరం బాలికల హైస్కూల్లో చట్టాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు పోక్సో చట్టం గురించి, బ్యాడ్ టచ్ గుడ్ టచ్ గురించి వివరించారు. విద్యార్థినులు కూడా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ధైర్యంగా చదువును సాగించాలన్నారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ కృపానందం, ప్యానల్ న్యావాది కె.అప్పయ్య పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ హర్షణీయం

ఏలూరు టూటౌన్, మార్చి22(ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ అందించేందుకు మంత్రి వర్గం ఆమోదం తెలపడం హర్షణీయమని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కన్నయ్య పేర్కొన్నారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇవ్వడం వల్ల వారికి ఎంతో లబ్ధి చేకూరుతుందని సంతోషం వ్యక్తం చేశారు. అలాగే చేనేత కార్మికులకు వర్క్ షెడ్లను నిర్మించి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలని, చేనేత చీరలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు.

కారుణ్య నియామకం

ఏలూరుటూటౌన్, మార్చి22(ఆంధ్రజ్యోతి): శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేంద్ర మరణించడంతో ఆయన కుమారుడు బంటుమిల్లి కార్తికేయను శానిటరీ మేస్త్రిగా నియమించారు. కారుణ్య నియామకాల్లో భాగంగా ఉద్యోగం కల్పించి నియామక పత్రాన్ని కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, అడిషనల్ కమిషనర్ చంద్రయ్యలు శనివారం అందజేశారు.

దెందులూరు ఇన్‌చార్జి ఉపాధి ఏపీవోగా ప్రసన్న



దెందులూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఇన్‌చార్జి ఏపీవోగా ఫాతిమా ప్రసన్న ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం దెందులూరు మండల ఏపీవోగా పని చేస్తున్న దశరథ రాంజీ జిల్లా డ్వామా కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. దెందులూరు ఉపాధి హామీ పథకంలో టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సీనియర్ ఉద్యోగి ఫాతిమా ప్రసన్నను ఆస్థానంలో నియమించారు. ఈ సందర్భంగా బాధ్యతలు తీసుకున్న ఆమె మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పిస్తానని అన్నారు.

బ్యాంకు సమ్మె వాయిదా

పోలవరం, మార్చి 22(ఆంధ్రజ్యోతి) : ప్రతిపాదిత స్టేట్ బ్యాంకుల సమ్మె వాయిదా కారణంగా స్టేట్ బ్యాంకుల సేవలు సోమవారం యదావిధిగా జరుగుతాయని స్టేట్ బ్యాంకు మేనేజర్ రవి కుమార్ శనివారం తెలిపారు. వినియోగదారులు తమ బ్యాంకు లావాదేవీలను సోమ, మంగళవారాలు కొనసాగించుకోవచ్చని సూచించారు.డ్వాక్రా మహిళలు, ఇతర వినియోగదారులు తమ బ్యాంకు లావాదేవీలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలన్నారు.

వేంకటేశ్వర స్వామికి పూజలు

పోలవరం, మార్చి22(ఆంధ్రజ్యోతి): పట్టిసీమలోని శ్రీదేవి భూదేవి సమేత సుదర్శన కల్యాణ వేంకటేశ్వరస్వామికి శనివారం భక్తుల తాకిడి పెరిగింది. పోలవరం, గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.సుమారు రెండు వేల మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించినట్టు అర్చకులు శంకర మంచి వెంకట్రామ శర్మ తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ మహిళలు అన్నదానం, పులిహోర ప్రసాద వితరణ నిర్వహించారు.

టెన్త్ పరీక్షలు ప్రశాంతం

ఏలూరు అర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ప్రథమ భాష పేపర్-2, ఓఎస్ఎస్‌సీ మెయిన్ లాంగ్వేజి పేపర్-1(సంస్కృతం) పరీక్షలకు జిల్లాలో మొత్తం 4398మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 4388 మంది హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. ప్రైవేటు విభాగంలో 18మంది విద్యార్థులకు 11మంది హాజరయ్యారని వివరించారు.

హోటల్‌పై విజిలెన్సు దాడి

ఏలూరు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : గృహ అవసరాలకు వినియోగించే సబ్సిడీ సిలిండర్లను హోటళ్లల్లో వినియోగిస్తున్నట్టు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి వి.శ్రీరామ్ బాబుకు సమాచారం అందింది. దీంతో విజిలెన్సు అధికారులు ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్ద ఉన్న జన్నత్ కచ్చి దమ్ము బిర్యాని హోటల్లో తనిఖీలు నిర్వహించారు. గృహ అవసరాల కోసం వినియోగించే ఎనిమిది గ్యాస్ సిలిండర్లను సీజ్ చేశారు. అలాగే యజమాని అబ్దుల్ సమాద్‌పై కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

ఏలూరు క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఏ కారణమో తెలియదు కాని పురుగుమందు తాగిన చింతలపూడి మండలం నామవరం గ్రామానికి చెందిన చిలక పిచ్చియ్య(34) ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

సంస్కృతం పరీక్షకు నూరుశాతం హాజరు

ముదినేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి సంస్కృతం పరీక్షలకు శనివారం ముదినేపల్లి మండలంలో నూరుశాతం విద్యార్థులు హాజరు నమోదైంది. మండలంలోని ముదినేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ హైస్కూలు, సహాయ మాతా హైస్కూలు పరీక్షా కేంద్రాల్లో 110 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా అందరూ హాజరయ్యారని ఎంఈవో కె.నరేశ్ కుమార్ తెలిపారు.

రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాలి

కలిదిండి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులు ఈనెల 31వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. మండలంలో 5,577 రేషన్ కార్డుదారులు ఈకేవైసీ చేయించుకోవాల్సి ఉందన్నారు. వీరంతా రేషన్ డీలర్ల వద్ద ఈపోస్ పరికరాల ద్వారా ఈకేవైసీని అప్‌డేట్ చేసుకునే సౌకర్యం ఉందన్నారు. ఐదేళ్ల లోపు పిల్లల మినహా మిగిలిన లబ్ధిదారులందరూ ఈకేవైసీ ప్రక్రియను గడువులోగా పూర్తి చేయాలని, లేకపోతే రేషన్ కార్డుదారులు భవిష్యత్‌లో ఇబ్బందులు పడతారన్నారు.

తాబేళ్లు పరుగెడుతున్నాయ్



- కొల్లేరు కేంద్రంగా అక్రమ రవాణా
- చేపల వ్యానుల్లో సరిహద్దులు దాటేస్తున్నాయి
- ఇతర రాష్ట్రాల్లో ఎక్కువ గిరాకీ
- జేబులు నింపుకుంటున్న అక్రమార్కులు
- కొరవడిన అధికారుల నిఘా

కైకలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు సరస్సు వివిధ రకాల మత్స్యసంపదకు పేరు. విదేశీ పక్షులకు ఆలవాలం. ఇలాంటి కొల్లేరు కేంద్రంగా అక్రమ తాబేళ్ల రవాణా యథేచ్ఛగా సాగుతోంది. అక్కడకక్కడా దొరికిన తాబేళ్లను గోనెసంచుల్లో మూటకట్టి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు. కైకలూరు నుంచి చేపల ఎగుమతి ముసుగులో ఈ తాబేళ్ల రవాణా జరుగుతోంది.
అంతరించిపోతున్న తాబేళ్ల జాతిని పరిరక్షించాల్సిన అటవీశాఖ అధికారులు పట్టించు కోకపోవడంతో జిల్లాలు, రాష్ట్రాలు సరిహద్దులు దాటి తరలిపోతు న్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 356 రకాల తాబేళ్ల జాతులున్నట్లుగా పర్యావరణ ప్రేమికులు పేర్కొంటున్నారు. కొల్లేరు మంచినీటి సరస్సు పరివాహక ప్రాంతంలో ఉండే ఈ తాబేళ్లకు ఇతర రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉండడంతో అక్రమార్కుల కన్ను వీటిపై పడింది. వీటిని పట్టి రవాణా చూస్తూ రూ.లక్షల్లో జేబులు నింపుకుంటు న్నారు. కలిదిండి మండలం మద్దవానిగూడెం వద్ద, కైకలూరు మండలం



గతంలో స్వాధీనం చేసుకున్న తాబేళ్లను కొల్లేరులో వదిలి వేస్తున్న అటవీశాఖ అధికారులు (ఫైల్ ఫొటో)

ఉప్పుటేరు వద్ద ఉన్న చెక్ పోస్టులను అక్రమార్కులు మేనేజ్ చేయడంతో సరిహద్దులు దాటేస్తున్నాయి.

వివిధ ప్రాంతాల నుంచి సేకరణ

కైకలూరు నియోజకవర్గంలో కైకలూరు, కలిదిండి, మండవల్లి మండలాల నుంచి కొల్లేరు ఇతర ప్రాంతాల్లో చేపల పట్టుబడుల సమయాల్లో వలలకు చిక్కిన తాబేళ్లను మత్స్యకారులు, యానాదుల నుంచి వారి వలలకు చిక్కిన తాబేళ్లను సేకరించి ఒక్కొక్కటి రూ.5 నుంచి రూ.10 వరకు కొనుగోలు చేస్తున్నారు. చెరువులు, కాలువల నుంచి సేకరించిన తాబేళ్లను జనసంచారం లేని బహిరంగ ప్రదేశాల్లో నిల్వచేస్తున్నట్లు సమాచారం. ఎగుమతులకు సరిపడా సేకరించిన తరువాత వాటిని చేపల వ్యానుల్లో ట్రేల చాటున గోనెసంచుల్లో ఉంచి రాత్రివేళల్లో సరిహద్దులు దాటిస్తున్నారు. వారానికి రెండు నుంచి మూడు రోజులు వేల టన్నుల్లో అక్రమ రవాణా జరుగుతున్నా అధికారుల కంట పడడం లేదు.

ఇతర రాష్ట్రాల్లో వీటి మాంసానికి గిరాకీ

ఈ తాబేళ్లకు ఇతర రాష్ట్రాల్లో మంచి డిమాండ్ ఉండడంతో ఒడిశా, అస్సోం, గోవా, కర్ణాటక రాష్ట్రాల్లో ఈ మాంసానికి గిరాకీ ఎక్కువగా ఉంటుంది. సుమారుగా కేజీ రూ.300 నుంచి రూ.400కు అమ్మకాలు జరుగుతున్నాయి. వీటిని స్థానికంగా రూ.10 నుంచి రూ.15కు కొనుగోలు చేసి రూ.100 నుంచి రూ.150కు విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వన్య ప్రాణి సంరక్షణ చట్టానికి తూట్లు పొడుస్తూ యథేచ్ఛగా రవాణా చేస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. వన్యప్రాణుల చట్టం 1972 ప్రకారం తాబేళ్లను వేటాడినా, రవాణా చేసినా ఏడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 వేలు వరకు జరిమానా విధిస్తారు. అయితే వీటిపై నిఘా లేకపోవడంతో వారి రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. ఆయా రాష్ట్రాల్లో ఆయుర్వేద ఔషధాల్లో వీటి మాంసాన్ని వినియోగిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు తాబేళ్ల అక్రమ రవాణాను అడ్డుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

● అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా

తాబేళ్ల అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. 45 రోజుల క్రితం కలిదిండి ప్రాంతంలో నూజివీడు టెరిటోరియల్ అటవీ శాఖ అధికారులు ఒక ఆటోను అదుపు లోకి తీసుకుని పది ట్రేలలో ఉన్న తాబేళ్లను స్వాధీనం చేసుకోవడమే గాక ఇద్దరిపై కేసు నమోదు చేశారు. కొల్లేరు ప్రాంతంలోనూ ఇతర సరిహద్దుల్లోనూ అటవీశాఖ అధికారులు ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేశారు. ఎక్కడైనా రవాణా జరుగు తున్నట్లు తెలిస్తే సమాచారం అందిచాలి.

- రామలింగాచార్యులు, రేంజర్, కైకలూరు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

టిప్పర్లతో బుసక రవాణా చేస్తే లారీలు సీజ్

ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): టిప్పర్లతో బుసక తోలకాలు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ హెచ్చరించారు. మండలంలోని వేమవరప్పాడు, తామరకొల్లు, ఆచవరం గ్రామాల్లో ఎన్‌ఆర్‌జీఎస్ నిధులతో నిర్మాణం చేసిన సిమెంటు రోడ్లను శనివారంఆయన ప్రారంభించారు. అనంతరం కైకలూరు ట్రావెలర్స్ బంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఇప్పటివరకు టిప్పర్లతో బుసక తోలుకునే అవకాశం కల్పించామని ఈ పనులు పూర్తి కావడంతో ఇకపైన టిప్పర్లను నియంత్రిస్తున్నట్లు వెల్లడించారు. ఎవరైనా బుసక తోలితే సీజ్ చేయాలని ఆదేశించారు. ట్రాక్టర్ల ద్వారా నియోజకవర్గం దాటిపోకుండా బుసక రవాణా చేస్తే రైతులకు ఇబ్బందులు ఉండవన్నారు. కొల్లేరు సమస్య పరిష్కారానికి సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకు వెళ్లామని, ప్రభుత్వం ద్వారా సెంట్రల్ ఎంపవర్ కమిటీ ద్వారా సుప్రీంకోర్టులో వాదనలు వినిపిస్తున్నామన్నారు. పర్యావరణాన్ని కాపాడుతూనే జిరాయితీ, డీఫామ్ పట్టాలను పునరుద్ధరణ చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. అనంతరం కైకలూరులో నూతనంగా నిర్మాణం చేసిన రెండో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీష్, ఎండీవో ఫణీంద్ర,తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లు ప్రారంభం

కలిదిండి : మండలంలో కోరుకొల్లు, ఆవకూరు, కొచ్చెర్ల గ్రామాల్లో రూ.40 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస చౌదరి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు శ్రీనివాస్, రామారావు, మురళీకృష్ణ, లీలా కనకదుర్గ, రాము, ఎన్.నరసయ్య పాల్గొన్నారు.



ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే కామినేని

కలిదిండి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసం పురస్కరించుకుని కలిదిండి పెద్ద మసీదులో శనివారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్ రావు,టీడీపీ మండల అధ్యక్షులు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, తాడినాడ బాబు, నల్లగోపుల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

శక్తియాప్‌పై అవగాహన

ముదినేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం మహిళల రక్షణ కోసం రూపొందించిన శక్తియాప్‌పై శనివారం ముదినేపల్లిలోని సాయిరాం డిగ్రీ కళాశాల విద్యార్థులకు పోలీస్ అధికార్లు అవగాహన సదస్సు నిర్వహించారు. శక్తి టీమ్ ఇన్‌ఛార్జి కైకలూరు ఏఎస్ఐ శ్రీనివాసరావు ఈ యాప్ వల్ల ప్రయోజనాలను వివరించారు. శక్తియాప్‌పై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకుని తోటి మహిళలకు వివరించాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మోహన సాయి, పోలీస్ సిబ్బంది స్వప్న, సత్యనారాయణ, రమారావు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుడికి పరామర్శ

కలిదిండి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు కోరుకొల్లుకు చెందిన కేశిరెడ్డి బలరామ్‌ను ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శనివారం పరామర్శించారు. ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ప్యానెల్ అడ్వకేట్ పవన్‌కాంత్

నీటి వినియోగం తగ్గించుకోవాలి

కైకలూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రతీ నీటిబొట్టును ఒడిసిపట్టి వృథా కాకుండా వినియో గించుకోవాలని ప్యానెల్ అడ్వకేట్ పవన్‌కాంత్ అన్నారు. శనివారం కైకలూరు మండలం వరహా పట్నంలో జాతీయ జల దినోత్సవం సందర్భంగా మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. గృహ అవసరాలకు నీటి వినియోగం తగ్గించుకోవాలని ప్రతీ నీటిచుక్క ఎంతో విలువైనదన్నారు. న్యాయవాది శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లి మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సత్యనారాయణ

తాగునీటి సమస్య రాకుండా చూడాలి : ఎంపీపీ

ముదినేపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున మండలంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ కోరారు. శనివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులను శుభ్రం చేసి స్వచ్ఛమైన నీరు అందించాలన్నారు. తాగునీటి సమస్య ఉండే గ్రామాలను గుర్తిస్తే ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా చేసేందుకు కృషి చేస్తామని, ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జడ్పీటీసీ రాచూరి రాధ, తహసీల్దార్ సుభానీ, ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు. వివిధ శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి పనులను చర్చించారు. నూతన గృహాల మంజూరుకు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు.

భానుడి ప్రతాపం

చాట్రాయి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రచండ భానుడి ప్రతాపాన్ని తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఉదయం 7 గంటల నుంచి ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నానికి తారాస్థాయికి చేరి సాయంత్రం వరకు తగ్గటం లేదు. ఎండకు తోడు వడగాల్పులు తోడయ్యాయి. ఉపాధి, వ్యవసాయ కూలీలు ఉదయం 6 గంటలకే పనులకు వెళ్ళి 11.30 గంటలకు ఇళ్లకు చేరుకుంటున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రజలు ఎండకు భయపడి ఇళ్లకే పరిమితం కావటంతో అన్ని గ్రామాల్లో వీధులు నిర్మానుషంగా మారుతున్నాయి. దుకాణాలు మధ్యాహ్నం మూసివేసి సాయంత్రం తెరుస్తున్నారు. ఆర్టీసీ బస్సులు జనం లేకుండా ఖాళీగా తిరుగుతున్నారు. మార్చి నెలలోనే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే ఏప్రిల్ మే నెలల్లో పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అన్ని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



నిర్మానుష్యంగా ఉన్న చాట్రాయి సెంటర్



చీకటి చెన్నారావు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నాయకులు

దివంగత నేత చీకటి చెన్నారావుకు నివాళి

చాట్రాయి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నూజివీడు నియోజకవర్గ తెలుగు యవత మాజీ ఉపాధ్యక్షుడు, దివంగత చీకటి చెన్నారావు వర్ధంతి శనివారం చాట్రాయి మండలం చీపురుగూడెంలో ఆయన స్వగృహంలో జరిగింది. చింతలపూడి నియోజకవర్గ టీడీపీ నాయకుడు జగ్గవరపు ముత్తారెడ్డి, నూజివీడు నియోజకవర్గ టీడీపీ నాయకులు కాపా శ్రీనివాసరావు, నూతక్కి వేణు, అక్కినేని చందు, జగ్గవరపు వెంకటరెడ్డి, గద్దె రఘుబాబు, మండల టీడీపీ నాయకులు చీకటి చెన్నారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పులిబొమ్మతో కోతుల బెడదకు చెక్

బూరుగుగూడెంలో ఓ రైతు ఐడియా

చాట్రాయి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పులిబొమ్మతో కోతుల బెడదకు రైతులు చెక్ పెడుతున్నారు. పంటలను కోతుల నుంచి కాపాడుకునేందుకు రైతులు పులిబొమ్మ, చింపాంజీ వేషధారణలు ఉన్న బొమ్మలను ఉపయోగిస్తున్నారు. చాట్రాయి మండలంలో అన్ని గ్రామాల్లో కోతుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. కోతుల మందలు మొక్కజొన్న చేలపై పడి ధ్వంసం చేస్తుండటంతో రైతులు పంటను కాపాడుకోటానికి అవస్థలు పడుతున్నారు. ఇంట్లో ఉన్న కుటుంబ సభ్యులు మొత్తం చేనుకు నాలుగు వైపులా కాపలా ఉన్నా కోతులను అడ్డుకోలేకపోతున్నారు. పులిబొమ్మను రైతు భుజాలపై పెట్టుకొని మొక్కజొన్న చేలో తిరుగుతుంటే దాన్ని చూసి కోతులు ఆ ప్రాంతం నుంచి కుయ్యో మొర్రో అంటూ పారిపోతున్నాయి. తమ ఐడియా పని చేసి కోతుల బెడద తగ్గడంతో రైతులు సంతోషపడుతున్నారు.





నీటి పొదుపుపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హెచ్ఎం

ప్రతి నీటి బొట్టును పొదుపు చేయాలి

చాట్రాయి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భావితరాలు దాహార్తితో ఇబ్బంది పడకుండా ప్రతి నీటి బొట్టును పొదుపు చెయ్యాలని హెచ్ఎం వెంకటరావు కోరారు. తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో శనివారం ప్రపంచ జల దినోత్సవం నిర్వహించారు.

ఆర్థిక సాయం

చాట్రాయి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేట గ్రామానికి చెందిన తీర్థాల నాగేశ్వరశాస్త్రి అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న నూజివీడు మానవతా స్వచ్ఛంద సంస్థ చైర్మన్ పి.కృష్ణప్రసాద్, సభ్యులు శనివారం చిన్నంపేట వచ్చి బాధితుడికి రూ.17,115 నగదు, 4 నెలలకు సరిపోను నిత్యావసర సరుకులు అందజేశారు.

సారా స్థావరంపై దాడి

▸▸ 345 లీటర్ల సారా స్వాధీనం

చాట్రాయి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చిత్తపూరు గ్రామ శివారులోని తడికలగట్టు కొండపై ఉన్న సారా స్థావరంపై శనివారం జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్‌సింగ్ ఆధ్వర్యంలో ఎన్ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణికుమార్, సిబ్బంది దాడి చేశారు. 345 లీటర్లు సారా, 1400 లీటర్లు పులిసిన బెల్లం ఊట, 128 కేజీల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. నేర స్థలం నుంచి పారిపోయిన నిందితులు పెజ్జారి బాలకృష్ణ, చలకంటి సతీశ్‌లపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడి గుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.475

భూగర్భ జలాలను సంరక్షించుకోవాలి



ముసునూరులో పంట కుంటను పరిశీలిస్తున్న అధికారులు

ముసునూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపీడీవో జి.రాణి అన్నారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ముసునూరు, సూరేపల్లి గ్రామాల్లో రైతుల పంటపొలాల్లో తవ్విన పంట కుంటలను ఏపీవో రోజ్‌లక్ష్మితో కలిసి ఆమె పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మట్లాడుతూ సర్వమానవాళికి అవసరమైన జలవనరులను కాపాడుకోవాలన్నారు. భూమిపై పడ్డ ప్రతి నీటిబొట్టును వడిసిపట్టేల రైతులు తమ పంటపొలాల్లో పంట కుంటలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఉపాధిహామీ పథకం ద్వారా ప్రభుత్వం పంట కుంట నిర్మాణాలను చేస్తోందని, రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండేటి ఉదయ్‌కిరణ్, నక్కా యోహాను, తోట శ్రీనివాసరావు, రెడ్డి కృష్ణ, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ రవికుమార్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్

నూజివీడు టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు ట్రిపుల్ ఐటీలో నిర్వహిస్తున్న ఎటర్నాక్స్ 2కె25, పూర్వవిద్యార్థుల సమ్మేళనం తొలిరోజు వేడుకలు ఆనందంగా, ఆహ్లాదకరంగా జరిగాయి. రెండు రోజులు పాటు నిర్వహించే ఈకార్యక్రమానికి ఆర్జీకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థులే ఆర్‌జీయూకేటీకి బలమన్నారు. ఈ సందర్భంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఆర్ట్, మ్యూజిక్ అండ్ కల్చర్ బృందం ప్రదర్శించిన శ్రీనివాస కళ్యాణం నృత్య విశేషంగా ఆకట్టుకున్నది. కార్యక్రమంలో శ్రీకాకుళం, ఒంగోలు డైరెక్టర్లు ప్రొ.బాలాజీ, డా.భాస్కర్ పటేల్, 2008 ట్రిపుల్ ఐటీ బ్యాచ్‌కు చెందిన 250 మంది పూర్వ విద్యార్థులు తమ కుటుంబ సభ్యులుతో కలిసి పాల్గొన్నారు.

అంతుచిక్కని వ్యాధితో పది గేదె దూడలు మృతి



జనార్దనవరంలో మృతి చెందిన గేదె దూడ

చాట్రాయి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనవరంలో అంతుచిక్కని వ్యాధితో గత 10 రోజుల నుంచి 10 గేదె దూడలు మృతి చెందటంతో పశుపోషకులు ఆందోళన చెందుతున్నారు. పశుపోషకులు గూంట్రు నాగేశ్వరరావు, కాళంగి ఏడుకొండలు, కాళంగి గోపాలరావు తదితరులకు చెందిన 10 గేదె దూడలు మృత్యువాత పడటంతో ఆవేదన చెందుతున్నారు. దూడలు ముందు రోజు పాలు తాగటం మానివేస్తున్నాయని, తరువాత రోజు జ్వరం వచ్చి మూడో రోజు చనిపోతున్నాయని బాధితులు అంటున్నారు. పశు వైద్యులు ఈ వ్యాధిని కనుగొని తగిన చికిత్స అందించి మూడజీవాల ప్రాణాలు కాపాడాలని పశుపోషకులు కోరుతున్నారు.

వ్యాక్సినేషన్ చేస్తాం..

అస్వస్తతకు గురైన గేదె దూడలకు పశువైద్య సిబ్బంది చికిత్స అందిస్తున్నారు. దూడల మృతికి కారణాలు తెలుసుకొని మెరుగైన చికిత్స అందిస్తాం. గ్రామంలోని దూడలన్నిటికి ఆదివారం వ్యాక్సినేషన్ చేస్తాం. పశు పోషకులు ఆందోళన చెందవద్దు.

- డాక్టర్ శివ నాగేంద్రరావు, ఇన్‌చార్జి మండల పశు వైద్యాధికారి

రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలుకు చర్యలు

▸▸ తహసీల్దార్ రాజ్‌కుమార్

ముసునూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు చేసేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం చింతలవల్లిలో మారుతి ట్రేడర్స్‌లో ఉన్న గోనె సంచులను ఆయన పరిశీలించారు. అనంతరం అక్కిరెడ్డిగూడెంలో జరుగుతున్న రీసర్వేను తహసీల్దార్ తనిఖీ చేశారు. ముసునూరులో రేషన్ లబ్ధిదారుల ఈకేవైసీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు మస్తాన్‌రావు, యశోద, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చంద్రరావును బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

మిస్సింగ్ కేసును ఛేదించిన పోలీసులు

ముసునూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చిల్లబోయినపల్లికి చెందిన అనగాని చంద్రరావు ఆచూకిని ముసునూరు పోలీసులు కనుగొన్నారు. ఈనెల 19 నుంచి తన తండ్రి కనిపించడం లేదని కూమారుడు గురువారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన ముసునూరు పోలీసులు 24గంటల్లో కేసును ఛేదించారు. వైజాగ్ వరకు వెళ్ళి, తిరిగి నూజివీడు ఆర్టీసీ బస్‌స్టాండ్‌కు వచ్చిన చంద్రరావు అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. శనివారం చంద్రరావును కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపారు.

బెల్లపు ఊట ధ్వంసం

నూజివీడు టౌన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నూజివీడు మండలం ఓగిరాల తండాలో సారా తయారీకి వినియోగించే బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎక్సైజ్ ప్రొహిబిషన్ ఎస్ఐ ఎ.మస్తానయ్య తెలిపారు. గతంలో చెక్కపల్లి గ్రామంలో సారా రవాణా చేసిన కేసులో నిందితునిగా ఉన్న చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన భూక్య కరణ్‌ను అదుపులోకి తీసుకొన్నట్టు తెలిపారు.